- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
15-06-2026

సంపుటి : 01 సంచిక :84 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.




Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha


Published From RANGAREDDY TELANGANA. RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 84 NAMASTEY MAHAAPRABHA


# హామీలు ఏమయ్యాయి?



## రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ ప్రశ్నల వర్షం

- రేవంత్ రెండున్నర పాలన డిజాస్టర్
- మీనాక్షికి వెన్నుపోటు పొడిచింది ఆయనే
- సంక్షేమ పథకాలు ఆయన హయాంలో అటకే
- కేసీఆర్ చేసిన అభివృద్ధే ఇప్పటికీ చెరగని సత్యం
- ఖైరతాబాద్ నేతల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, జూన్ 14( మహా ప్రభ)
సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టి రెండున్నరేళ్లయినా.. ఒక్క పని పూర్తి చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆర్మర్శించారు. ఖైరతాబాద్ జిల్లా కార్యకర్తలకు ఎన్ఎస్ఆర్ పై ఆదివారం నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ ప్రభుత్వం గరీబోళ్ల పొట్ట కొట్టిందని ఆరోపించారు. హైడ్రా పేరుతో వందల ఇళ్లను కూలగొట్టి, కుటుంబాలను రోడ్డున పడేశారని వాపోయారు. నాడు కేసీఆర్ రెండున్నర లక్షల మందికి ఇళ్ల పట్టాలిస్తే.. రేవంత్ సర్కారు మాత్రం -మిగతా 3 లో



3

## అమెరికాకు మోడీ విధేయుడైన సేవకుడు!

- ట్రంప్ ఆదేశాలను యథాతథంగా పాటిస్తున్నారు
- భారతీయుల మరణానికి కారణమైన అమెరికా కనీసం క్షమాపణలు చెప్పలేదు
- సార్వభౌమాధికారం ఉన్న ఏ దేశమైనా ఇలాంటి భాషను సహిస్తుందా?
- మోడీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు

## భారత్‌కు రండి... పెట్టుబడులు పెట్టండి

భారత్ ఇన్నొవేట్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మోడీ, మాక్రాన్



3



## సింగరేణిలో దోపిడీదారులకు స్థానం లేదు

- కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే క్షమించం
- రాజకీయ స్వార్థం కోసం సింగరేణి ప్రతిష్టను దెబ్బతీస్తారా?
- శ్రీరామ్‌పూర్ ఓపెన్ కాస్ట్ బొగ్గు గని సందర్శనలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫైర్

హైదరాబాద్, జూన్ 14( మహా ప్రభ)
సింగరేణిలో దోపిడీదారులకు స్థానం లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి కార్మికుల శ్రమను, వారి ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలపై ఆయన మరోసారి నిప్పులు చెరిగారు. తమ రాజకీయ స్వార్థం కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణి గురించి ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సమాధానం చెప్పేందుకు ఆదివారం నాడు మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ మైనింగ్ ను మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌస్ తనిఖీ నిర్వహించి, వాస్తవాలను వెల్లడించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. సింగరేణి సంస్థపై జరుగుతున్న ప్రచారంలో ఏది నిజం, -మిగతా 3 లో

## రేవంత్ రిజైన్ చేస్తేనే హైదరాబాద్ అభివృద్ధి

- నగర ప్రజలు మిమ్మల్ని గద్దె దింపుతారు
- ఇదే మీ ఫ్యూచర్
- మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలుస్తుంది
- అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో రేవంత్‌రెడ్డిపై బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు ఫైర్



హైదరాబాద్, జూన్ 14( మహా ప్రభ)
మున్సిపల్ మంత్రిని దగ్గర పెట్టుకున్న సీఎం రేవంత్ రాజీనామా చేస్తేనే హైదరాబాద్ నగరం అభివృద్ధి చెందుతుందని బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. ప్రతిసారి మా ఎంపీలపై నోరు పారేసుకుంటూ రాజీనామా చేయాలని రేవంత్ అనడంపై ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ ప్రజలు మిమ్మల్ని గద్దె దింపుతారని, ఇదే మీ ఫ్యూచర్ అని ఎద్దేవా చేశారు. ఉన్న సిటీని వదిలేసి -మిగతా 3 లో

## 'ఇండియా'పార్టీల్లో అంతర్మథనం

- కాంగ్రెస్ వెన్నుపోటు రాజకీయాలతో ఇప్పటికే దూరమైన డీఎంకే, ఆప్
- రాహుల్ వైఖరితో పార్టీల్లో విసుగు
- 'హగ్' వ్యాఖ్యలపై లెఫ్ట్ గరం గరం

3



## దేశం దశ, దిశను మార్చేది యువతే

- భయం, ద్వేషం లేని భారత్ సీజేపీ లక్ష్యం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తప్పించాలి
- ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్
- ఇందిరా పార్క్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ధర్నా
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐతో పాటు యువజన, విద్యార్థి, స్వచ్ఛంద సంస్థల మద్దతు

3





## జోరుగా సాగుతున్న అమరావతి పనులు

- పనులపై జరుగుతున్న విష ప్రచారాన్ని ఆపాలి
- వర్షం వస్తే పనులు ఆగిపోతాయన్న వార్తలను ఖండించిన లోకేష్
- పనుల పురోగతిని చూపిస్తూ 'ఎక్స్' వేదికగా వీడియో విడుదల

అమరావతి జూన్ 14( మహా ప్రభ)
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు శరవేగంగా, ఎక్కడా విరామం లేకుండా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. రాజధాని పనులు ఆగిపోయాయని, చిన్న వర్షానికే మునిగిపోతోందని కొందరు చేస్తున్న విష ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు నిర్మాణ పనుల పురోగతిని -మిగతా 3 లో

# వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిందే


## అవసరమైతే నేనూ వస్తా

- ఉన్నతస్థాయి సమీక్ష లో అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్
- జూన్ 1న చెప్పినా... నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- మరోసారి అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు
- ఇప్పటికైనా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధం కావాలి
- విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలని ఆదేశం

వర్షం కురిసిన సమయంలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు రోడ్లపైన ఉండాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అవసరమైతే తానే స్వయంగా రోడ్‌పైకి వస్తానని స్పష్టం చేశారు. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్ అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు వస్తే సహించబోనన్నారు. ట్రాఫిక్ డిపార్ట్మెంట్‌లో తక్షణమే ఖాళీలు పూర్తి చేయాలని సూచించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో వర్షాలు, ప్రకృతి విపత్తులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష ఆదివారం సమీక్షించారు. వర్షాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు.

3





2

## ఎల్‌నినో ప్రారంభమైంది

- నైరుతిలో బలం పుంజుకోవచ్చు
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

## ఇరాన్, అమెరికా డీల్ ఫైనల్



3

## గాల్లో ఢీకొన్న రెండు హెలికాప్టర్లు..



3




## దేశ సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను దిగజార్చిన మోడీ ప్రభుత్వం :



**న్యూఢిల్లీ జూన్ 14( మహా ప్రభ)**
దేశ సార్వభౌమాధికారాన్ని, అంతర్జాతీయ ప్రతిష్టను మోడీ ప్రభుత్వం దిగజార్చిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. ఒమన్ తీరంలో అమెరికా సైనిక దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటనపై ప్రధాని మోడీ మౌనం వహించడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. ఈ ఘటన జరిగి మూడు రోజులు గడిచినా ప్రధాని నుండి కనీసం ఒక సంతాప సందేశం గాని లేదా బహిరంగ ప్రకటన గాని వెలువడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా దాడుల్లో మరణించిన వారి మృతదేహాలు భారత్ కి చేరుకుంటున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ఎక్స్ లో ఘాటుగా స్పందించారు. గతంలో అలీన విధానాన్ని అనుసరిస్తూ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కాపాడుకున్నప్పుడే భారత్ నిజమైన 'విశ్వగురువు'గా ఉండేదని, ప్రస్తుతం మోడీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని విమర్శించారు. విదేశాంగ విధానాల విషయంలో భారతీయుల ప్రాణాలను తేలికగా తీసుకోకూడదని, జవాబుదారీతనానికి మౌనం ఎంతమాత్రం ప్రత్యామ్నాయం కాదని ఖర్గే స్పష్టం చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని మోడీపై మండిపడ్డారు. అమెరికా దాడుల్లో మన దేశ పౌరులు మరణిస్తే, ఆ దేశాన్ని గట్టిగా నిలదీయాల్సింది పోయి వారి బెదిరింపులకు తలొగ్గుతున్నట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. పౌరులను, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రధాని మోడీ విఫలమయ్యారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం

### పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి



**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**
మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

## అఖిలేష్ కుమార్తెపై అసభ్యకర కామెంట్స్..

### -యూపీ సీఎం యోగీ సీరియస్

**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**



సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కుమార్తెపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. నేతల కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావొద్దని హితవు పలికారు. అఖిలేష్ యాదవ్ కుమార్తెపై అసభ్యకరమైన కామెంట్స్‌తో మార్ఫింగ్ చేసిన చిత్రాలను కొందరు దుండగులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా యోగి ఆదిత్యనాథ్ దీనిపై స్పందించారు. అఖిలేష్ యాదవ్ కుమార్తె లక్ష్యంగా కొందరు తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆ పోస్టులు తన దృష్టికి వచ్చాయన్నారు. నిందితులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆడపిల్లలు అందరికీ సమానమేనని, వారిని గౌరవించాలని సూచించారు. ప్రతి ఇంట్లో కుమార్తె, సోదరి ఉంటారని, ఇతరులను కూడా అదే భావనతో చూడాలని అన్నారు. అఖిలేష్ కుమార్తె తనకు కుమార్తెతో సమానమని చెప్పారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేడు..

### ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ ఫైర్

**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**
హర్మూజ్ జలసంధి లో ఇటీవల అమెరికా సైన్యం చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించడంపై భారత ప్రభుత్వ స్పందన సరిగా లేదని లోక్‌సభ (రాశీని ఝుఎష్ఖు) లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం అమెరికాకు ఒక నమ్మకమైన సేవకుడిలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఘటనపై రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఘటనపై అమెరికా ఏమాత్రం పశ్చాత్తాపం చూపకపోగా.. వారి ఆదేశాలను పాటించని నౌకలను సహించబోమని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో హెచ్చరించడాన్ని




ఆయన తప్పుబట్టారు.'అమెరికా దాడుల్లో మన ముగ్గురు నావికులు చనిపోయి కొద్ది రోజులే అయ్యింది. అయినా ఇంతవరకు వారి నుంచి కనీసం పశ్చాత్తాపం లేదు. క్షమాపణ లేదు. పైగా మనకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. 'అమెరికా సైన్యం ఆదేశాలను తక్షణమే పాటించాలి. ఎలాంటి ఉల్లంఘనలైనా సహించేది లేదు' అన్న వారి మాటలు చూడండి. ఒక స్వతంత్ర దేశం ఇలాంటి భాషను ఎప్పటికీ సహించదు. కానీ మన బలహీన ప్రధాని మాత్రం నోరు మెదపడం లేదు. ఒక విధేయుడైన సేవకుడిలా వారి ఆదేశాలను వింటున్నారు, పాటిస్తున్నారు. ఈ బలహీన ప్రధాని దేశ గౌరవాన్ని కాపాడలేరు. ఎందుకంటే దేశాన్ని అవమానించే వాళ్ల నియంత్రణలో ఆయన ఉన్నారు. అందుకే మన వాళ్లను చంపినా, మనల్ని అవమానించినా ఆయన మౌనంగా ఉండిపోతున్నారు. ఇది దేశ ప్రజలందరూ గమనించాలి' అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇతర నేతలు కూడా కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనపై అమెరికా బేషరతుగా క్షమాపణ చెప్పాలని పవన్ ఖేరా డిమాండ్ చేశారు. విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందన చాలా బలహీనంగా ఉందని, ఆయన కేవలం 'ఇది సమర్థనీయం కాదు' అనడం సరికాదని అన్నారు. మరో నేత మనీశ్ తివారీ మాట్లాడుతూ.. అమెరికా మంత్రి వ్యాఖ్యలు బెదిరింపుగా ఉన్నాయని, నావికుల మృతికి వారే కారణమన్నట్లుగా ఉన్నాయని ఆరోపించారు.

# ఎల్‌నినో ప్రారంభమైంది

### నైరుతిలో బలం పుంజుకోవచ్చు
### భారత వాతావరణ శాఖ హెచ్చరిక

**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**
భూమధ్య రేఖ పసిఫిక్ మహా సముద్రంపై ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారికంగా ధ్రువీకరించింది. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతు పవనాల సీజన్‌లో ఈ వాతావరణ దృగ్విషయం మరింత బలపడే అవకాశం ఉన్నదని హెచ్చరించింది. ఇండియన్ ఓషన్ డైపోల్(ఐఓడీ) తన బులెటిన్‌లో మధ్య, తూర్పు పసిఫిక్‌లో సముద్ర ఉష్ణోగ్రతలు వేడెక్కడం ఎల్ నినో పరిస్థితులకు అవసరమైన పరిమితిని దాటినట్లు వెల్లడించింది. కాగా మాన్‌సూన్ మిషన్ కపుల్డ్



ఫోర్‌కాస్ట్ సిస్టమ్(ఎంఎంసీఎఫ్ఎస్) ద్వారా రూపొందిన అంచనాలు సీజన్ ముందుకు సాగుతున్న కొద్దీ ఎల్‌నినో తీవ్రమయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నాయి.భూమధ్య రేఖ పసిఫిక్‌లోని అధిక భాగంలో సముద్ర ఉపరితలం కింద కూడా బలమైన సానుకూల ఉష్ణోగ్రత క్రమరాహిత్యాలు ఉన్నాయని ఐఎండీ గమనించింది. రాబోయే నెలల్లో వెచ్చని నీరు నిరంతరం పైకి రావడం.. ఈ పరిణామాన్ని మరింత బలోపేతం చేయడానికి సంకేతమని తెలిపింది. అయితే భారత దేశ రుతు పవనాలను ప్రభావితం చేసే ఏకైక అంశం ఎల్ నినో మాత్రమే కాదని ఐఎండీ స్పష్టం చేసింది. హిందూ మహా సముద్రంపై ప్రస్తుతం తటస్థ ఇండియన్ ఓషన్ డైపోల్(ఐఓడీ) పరిస్థితులు ఉన్నాయని ఇవి రుతు పవనాల సీజన్ పొడవునా కొనసాగే అవకాశం ఉన్నదని, తటస్థ ఐఓడీ అనేది ఈ సంవత్సరంలో ఎల్ నినో ప్రభావాలను గణనీయంగా పెంచే లేదా తగ్గించే అవకాశం లేదని తెలిపింది.

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులు..

### -ముగ్గురు మృతి

**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**
ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. లెబనాన్‌పై మరోసారి ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడింది. బీరూట్ (దీవఅతీబ్)లోని హెజ్బొల్లా ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది. దాడికి సంబంధించిన దృశ్యాలను ఇజ్రాయెల్ వైమానిక దళం ఆదివారం పోస్ట్ చేసింది. బీరూట్ శివార్లలోని హెజ్బొల్లా బలమైన స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. పేలుడు సంభవించడంతో భవనం చుట్టూ దట్టమైన పొగలు కమ్ముకున్నాయి.లెబనాన్ అధికారిక నేషనల్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. హెజ్బొల్లాకు బలమైన కేంద్రంగా ఉన్న దక్షిణ బీరూట్ శివార్లలోని



దాహియేలోని ఘోబెయరీ పరిసరాల్లోని ఓ భవనంపై ఈ దాడి జరిగింది. ఈ దాడి జరిగిన సమయంలో అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న రోడ్డుపై వాహనాలు వెళుతుండటం కూడా ఈ వీడియోలో కనిపిస్తోంది. అయితే ఈ దాడిలో ఏవైనా వాహనాలు దెబ్బతిన్నాయా అనేదానిపై స్పష్టత లేదు. ఇరాన్ మద్దతు ఉన్న హెజ్బుల్లా గ్రూప్ ఉత్తర ఇజ్రాయెల్ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటే.. తాము దక్షిణ బీరూట్‌పై దాడి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా పలువురు అధికారులు హెచ్చరించారు. ఈ నిర్ణయానికి వాషింగ్టన్ మద్దతు కూడా ఉందని వారు పేర్కొన్నారు. హెజ్బొల్లా ప్రయోగించినట్లుగా అనుమానిస్తున్న మూడు డ్రోన్లు ఉత్తర ఇజ్రాయెల్‌పై వేర్వేరు ఘటనల్లో దాడి చేశాయని.. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ సైన్యం ఇవాళ తెల్లవారుజామున తెలిపింది. ఇజ్రాయెల్ భద్రతకు, ఐడీఎఫ్ దళాలకు ముప్పుగా ఉన్న ఏ లక్ష్యాన్నైనా నిర్వీర్యం చేసేందుకు తాము చర్యలు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ వైమానిక దళం స్పష్టంచేసింది. హిజ్బుల్లా మాత్రం దక్షిణ లెబనాన్‌లోకి చొరబడ్డ ఇజ్రాయెల్ దళాలపై పలు దాడులు జరిపినట్లు ప్రకటించినప్పటికీ.. ఉత్తర ఇజ్రాయెల్‌పై డ్రోన్ దాడులకు తామే బాధ్యులమని ప్రకటించలేదు.

# దేశ ఆర్థికవ్యవస్థపట్ల తమ శ్రద్ధను రాహుల్‌గాంధీ గుర్తించలేకపోతున్నారు

**న్యూఢిల్లీ:జూన్ 14( మహా ప్రభ)**
దేశ ఆర్థికవ్యవస్థ, కుటుంబాల సంక్షేమం విషయంలో తాము చూపిస్తున్న శ్రద్ధను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గుర్తించలేకపోతున్నారని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆయన లోక్‌సభ లో మాట్లాడిన ప్రతిసారీ కేవలం విమర్శలకే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకునే క్రమంలో దేశం సాధించిన విజయాలను తక్కువ చేసి చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో వికసిత్ భారత్ సంకల్ప సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు.'భారీ విపత్తు ముంచుకొస్తోందని, రాబోయే కొద్ది వారాల్లో అంతా కుప్పకూలిపోతుందని రాహుల్ గాంధీ తరచూ



అంటుంటారు. ఆయన చెబుతున్నట్లుగా దేశంలో ఎలాంటి సంక్షోభం లేదు. ఆర్థికవ్యవస్థ ఏటికేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతోంది. జీడీపీ గణాంకాలూ దీనిని సూచిస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నది. అయినప్పటికీ భారత్ సంక్షోభంలో ఉందని ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేందుకు యత్నిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలోనూ దేశం ప్రగతి పథంలో సాగుతోంది. ఇంధన సరఫరాలు నిరంతరాయంగా కొనసాగేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారు' అని చెప్పారు. ప్రధాని మోదీ నేతృత్వంలో 12 ఏళ్ల పాలన.. అభివృద్ధి, సంక్షేమంతో సాగిందని నిర్మలా సీతారామన్ చెప్పారు. మొత్తం 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. గ్రామీణ పారిశుద్ధ్య కార్యక్రమాల కింద 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని అన్నారు. ప్రస్తుతం దేశంలో 58 కోట్ల జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయని వెల్లడించారు. మొత్తం 144 కోట్ల ఆధార్‌లు, 125 కోట్ల మొబైల్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. డిజిటల్ లావాదేవీలకు 'యూపీఐ' ఓ నమూనాగా మారిందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

## అన్నాడీఎంకేను వీడిన నటి గౌతమి

**చెన్నై,జూన్ 14( మహా ప్రభ)**
అసెంబ్లీ ఎన్నికల్లో అపజయం తర్వాత అన్నాడీఎంకే పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. పలువురు నాయకులు వరుసబెట్టి పార్టీని వీడుతున్నారు. తాజాగా ప్రముఖ నటి గౌతమి ఆ పార్టీని వీడారు. బరువైన హృదయంతో పార్టీ నుంచి బయటకు వస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు.పార్టీ డిప్యూటీ ప్రచార కార్యదర్శి హోదాలో ఉన్న ఆమె, పార్టీ పదవికి, పార్టీ



ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ మేరకు పార్టీ జనరల్ సెక్రటరీ పళనిస్వామికి రాజీనామా లేఖను పంపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, తన సామాజిక సేవను కొనసాగించేందుకు గాను..పార్టీ నుంచి బయటకు వస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు.

# ఇరాన్, అమెరికా డీల్ ఫైనల్

**-భగ్గుమన్న ఇరాన్ ప్రజలు**
**-ఒప్పందానికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు**
**- దేశ ప్రయోజనాలను పాలకులు తాకట్టు పెట్టారంటూ నిరసనలు**



తెహ్రాన్,
యూఎస్‌తో డీల్ విషయంలో ఇరాన్‌లోని అతివాదులు నిరసన బాట పట్టారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అరాగ్జీ, పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ ఖాలీబ్ కు వ్యతిరేకంగా నిరసనలకు తెరతీశారు. నేడు ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తో పాటు పాక్ కూడా ప్రకటించడంతో ఇరాన్‌లో నిరసనలు మిన్నంటుతున్నాయి. ఇరాన్ అధికార వర్గాలు మాత్రం ఈ విషయంపై అచితూచి స్పందిస్తున్నాయి. అయినప్పటికీ, తమ దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగేలా విదేశాంగ శాఖ మంత్రి, స్పీకర్ యూఎస్‌తో ఒప్పందానికి సిద్ధమవుతున్నారంటూ కొందరు ఇరానియన్లు అగ్మీద గుగ్గిలమవుతున్నారు.

**పెద్ద ఎత్తున నిరసన..**
అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, మషాద్ నగరంలోని విదేశాంగ శాఖ కార్యాలయం ముందు అనేక మంది అతివాదులు పెద్ద ఎత్తున నిరసనకు తెరతీశారు. యూఎస్‌తో ఒప్పందం గురించి మంత్రి అరాగ్జీ ప్రస్తావించిన అనంతరం దేశంలో ఆగ్రహావేశాలు ఉప్పందుకున్నాయి. అనేక మంది అరాగ్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన దేశానికి తలవంపులు తెచ్చే పని చేశారని, మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. రాజధాని తెహ్రాన్‌తో పాటు అనేక ఇతర ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తున్నాయి..

**ఇరాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయి..**
యూఎస్‌తో కుదుర్చుకోనున్న ప్రతిపాదిత డీల్‌లో ఇరాన్ ప్రయోజనాలకు రక్షణలు లేవని ఇరాన్‌లోని అతివాద వర్గం ఆరోపిస్తోంది. ఈ డీల్ కుదిరితే హోర్ముజ్ పై ఇరాన్ పట్టుసడలిపోతుందని వారు చెబుతున్నారు. అంతిమంగా ఇరాన్ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీల్ కోసం అమెరికా చెప్పినట్లులా తలలూపుతున్నారని ఇరాన్ పాలకు వర్గాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డీల్ కుదిరాక అమెరికా విధించిన నిర్బంధం తొలిగిపోతుందని అరాగ్జీ ఇటీవల చెప్పారు.

# గాల్లో ఢీకొన్న రెండు హెలికాప్టర్లు..

**ఆరుగురు మృతి.. బ్రెజిల్‌లో ఘటన**



**రియో డి జనీరో**
బ్రెజిల్‌లోని రియోడి జనీరోలో ఆదివారం ఉదయం రెండు హెలికాప్టరు గాల్లో ఢీకొని కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. హెలికాప్టర్లలో ఒకటి ఎలక్ట్రిక్ వాహనాలు పార్క్ చేసిన ప్రాంతంలో కూలిపోయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ హెలికాప్టర్లు ఢీకొనడానికి గల కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# హామీలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న గూడును కూల్చేసందన్నారు. మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. రెందున్నరేళ్లలో డిజాస్టర్ సీఎంగా నిలిచారని విమర్శలు గుప్పించారు. వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు పెన్షన్, రెండు లక్షల ఉద్యోగాలు, ఆడబిడ్డలకు ఇస్తామని రూ.2500 సహాయం ఏమైందని నిలదీశారు. నోరు తెరిస్తే కోటిమంది మహిళలను కోటీశ్వర్లుని చేస్తామని ఉదరగొడుతున్న సీఎం రేవంత్.. ఆ ముచ్చట పక్కకు పెట్టి కనీసం వారిని లక్షాధికారులనైనా చేయాలన్నారు. ఆడబిడ్డలకు ఇస్తామన్న నెలకు రూ.2500 ఆర్థిక సహాయం బకాయిలతో సహా లక్షన్నర రూపాయలు ఇస్తే.. వెంటనే రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు.

మీనాక్షికి సీఎం వెన్నుపోటు..
నాగేందర్ కు ఓటేస్తే నాకేస్తారని ఖైరతాబాద్ ప్రజలకు బాగా తెలుసన్నారు. అందుకే ఇక్కడి ఓటర్లు దానం నాగేందర్‌ను చూసి ఓటయ్యలేదని, కేసీఆర్ ను చూసి ఓటువేశారన్నారు. మీనాక్షి నటరాజన్ ఇష్యూపై కూడా కేటీఆర్ ఘాటు విమర్శలు చేశారు. ఆమెకు వెన్నుపోటు పొడిచింది సీఎం రేవంత్ రెడ్డని ఆరోపించారు. రేవంత్ అవినీతిపై మీనాక్షి.. రాహుల్ గాంధీకి రిపోర్ట్ ఇచ్చిందని అందుకు ఆమెపై పగపట్టారని, అందుకే బీజేపీకి లీకులిచ్చి రాజ్యసభ పదవి రాకుండా చేశారని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ పాలనకు సగం టైమ్ ముగిసిందన్న కేటీఆర్.. సీఎం ఫస్టాఫ్ సినిమా డిజాస్టర్ గా నిలిచిందన్నారు. రెందున్నరేళ్లకాలంలో హైదరాబాద్ లో ఒక్క అభివృద్ధి పని చేయకపోగా.. ఉన్నవాటినే కూల్చేశారన్నారు. నిజంలా కాలంలో, కేసీఆర్ హయాంలో కట్టిన యూనివర్శిటీలు, ఆసుపత్రులే నేడు ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్నారు.

# భారత్‌కు రండి... పెట్టుబడులు పెట్టండి

**– భారత్ ఇన్నొవేట్స్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మోడీ, మాక్రాన్**



నైస్ (ఫ్రాన్స్)
వినూత్న ఆలోచనా ధోరణులకు, ఆవిష్కరణలకు, అభివృద్ధికి భారత్ ఒక గమ్యం వంటిదని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. నైస్‌లో భారత్ ఇన్నొవేట్స్ 2026 కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రతి ఒక్క పెట్టుబడిదారుడు, ప్రతి యూనివర్శిటీ, పరిశోధనా సంస్థ, ప్రతి పారిశ్రామికవేత్త అందరూ కూడా భారత్‌కు రావాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాను. భారత్‌లో రూపకల్పన చేయండి, భారత్‌లో అభివృద్ధి పరచండి, ప్రపంచం కోసం పరిష్కారాలను సృష్టించండి." అని మోడీ పేర్కొన్నారు. మోడీతో కలిసి ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ద్వైపాక్షిక సంబంధాలు, సాంకేతికత రంగంలో విశ్వాసం, సహకారం అనే అంశాలపై ఇరువురు నేతలు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, విదేశాంగ మంత్రి జై శంకర్, నైస్ మేయర్ పాల్గొన్నారు. ప్రధాని మోడీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, దశాబ్ద కాలం క్రితమే భారత్‌ను సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే దేశంగా పరిగణించారని, ఇప్పుడు సాంకేతికతను అందించే దేశంగా ఆవిర్భవించిందని చెప్పారు. రోదసీ రక్షణ పరిశ్రమల కార్యకలాపాల గురించి ప్రస్తావిస్తూ, భారత్‌లో ఆవిష్కరణ వ్యవస్థ కోసం తాను పాటు పడినట్లు మోడీ పేర్కొన్నారు.

# వర్షం వస్తే రోడ్లపై ఉండాల్సిందే

**ఉన్నతస్థాయి సమీక్ష లో అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**
**జూన్ 1న చెప్పినా... నిర్లక్ష్యంగా వ్యవహరించారు**
**మరోసారి అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు**
**ఇప్పటికైనా వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధం కావాలి**
**విత్తనాలు, యూరియా పంపిణీపై దృష్టి సారించాలని ఆదేశం**



హైదరాబాద్
'వర్షాకాలం నేపథ్యంలో ఈనెల 1న నేను సమీక్ష నిర్వహించా. అనేక సూచనలు చేశా. అయినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించా రు. దాంతో ఈనెల 9న వర్షం వచ్చిన సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వ యం లోపించింది. ఈ పరిస్థితికి గల కారణాలను విశ్లేషించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి...' అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి వస్తే కఠిన చర్యలు తీసుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. వర్షాలు వచ్చినప్పుడు అధికారులు, పోలీసులు అందరూ రోడ్లపైనే ఉండాలని ఆదేశించారు. అవసరమైతే తానూ వస్తానని తెలిపారు. ?వర్షాలు పడినప్పుడు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించా రు. వర్షాకాల సన్నద్ధతపై ఆదివారం హైదరాబాద్ లోని ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష? సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కోర్ అర్బన్ రీజియన్‌లో వర్షం కారణంగా ఈనెల 9న ఏర్పడిన పరిస్థితులపై ఆరా తీశారు. సైబరాబాద్ తోపాటు అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ కావడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తం కాలేదన్నారు. ఆ శాఖ సూచనల మేరకు వర్షాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం పడిన సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి సిబ్బందితో పాటు సివిల్ పోలీసులు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. పోలీసు కమిషనర్ నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు అందరూ రోడ్లపైకి రావాల్సిందేనని తేల్చిచెప్పారు. అవసరమైతే తానూ రోడ్డుపైకి వస్తానని చెప్పారు. వర్షం కారణంగా ట్రాఫిక్ జామ్ అయితే ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్ విభాగంలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని డీజీపీకి సూచించారు. మానవ తప్పిదాల వల్ల సమస్యలు తలెత్తితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోనని హెచ్చరించారు. వర్షాల సమయంలో ఏర్పడే వాటర్ లాగింగ్ పాయింట్లు, బ్లాక్ స్పాట్లు, ట్రాఫిక్ జామ్ అయ్యే ప్రాంతాల డేటా ఆధారంగా అధికారులు సన్నద్ధం కావాలని సూచించారు.

వర్షం కారణంగా పలు చోట్ల చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరగాలని సూచించారు. అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం సమయంలో విద్యుత్ సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. మాన్యువల్ ప్రకారం ప్రాజెక్టుల నిర్వహణ ఉండాలన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టుల వద్ద సంబంధిత ఇంజినీర్లు తప్పనిసరిగా స్థానికంగా ఉండాలని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ప్రాజెక్టులను వదిలి వెళ్లే ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రాజెక్టుల గేట్ల మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు సూచించారు.

# సింగరేణిలో దోపిడీదారులకు స్థానం లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఏది అబద్ధమనే వాస్తవాలను ప్రజలముందుకు తీసుకురావాలనే ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు, స్వార్థ ప్రయోజనాల కోసమే అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. రాజకీయంగా మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. ?ప్రజా ప్రభుత్వం చెప్పేది కేవలం నిజాలు మాత్రమేనని, ఆ నిజాన్ని ప్రజల ముందు ఉంచడమే తమ బాధ్యతని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.
సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల చెమట, కఠోర శ్రమ దాగి ఉన్నాయని, వారి ఆత్మగౌరవాన్ని అపహాస్యం చేసేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదు. సింగరేణి యాజమాన్య నిబద్ధతను, సంస్థలోని పారదర్శక విధానాలపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రానికి మకుటాయమానమైన సింగరేణి సంస్థను అభాసుపాలు చేయాలనే తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కేంద్రానికి లేఖలు రాయడం సత్యదూరంగా ఉన్నాయి. ?సొంత రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ భవిష్యత్తును, సింగరేణి సంస్థను వాడుకోవడం సరికాదు అని భట్టి హెచ్చరించారు.

ఇది ప్రజల ఆస్తి..
?సింగరేణి కేవలం ఒక సంస్థ మాత్రమే కాదు. ఇది తెలంగాణ ప్రజల ఆస్తి. ఇక్కడి వనరులు, ఈ వ్యవస్థ, ఈ శక్తి అంతా ప్రజల నుంచి వచ్చిందే. ఇది ఎప్పటికీ ప్రజలకే చెందుతుంది. ??సింగరేణి సంస్థపై దోపిడీదారులు, దేగలు కన్నెత్తి చూసేందుకు కూడా భయపడేలా ప్రజా ప్రభుత్వం అత్యంత ఖచ్చితత్వంతో పని చేస్తుంది. రాజకీయ అవసరాల కోసం సంస్థను వాడుకోవాలని చూస్తే ఊరుకోం. భవిష్యత్తులోనూ సింగరేణి అత్యంత పారదర్శకంగా ముందుకు సాగుతుంది అని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, రవాణా ప్రక్రియలో పూర్తి పారదర్శకతను ప్రజలకు తెలియజెప్పడమే ప్రజా ప్రభుత్వం బాధ్యతన్నారు. మైన్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు అక్కడ అమలు అవుతున్న భద్రతా ప్రమాణాలు, బొగ్గు రవాణాకు సంబంధించిన లెక్కలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ?శ్రీరాంపూర్ ఓసీ మైన్ నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం మరో 28 సంవత్సరాల పాటు ఇక్కడ బొగ్గు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ?సింగరేణి సంస్థలో జరుగుతున్న ప్రతి ప్రక్రియ అత్యంత ఆధునికంగా, కంప్యూటరైజ్డ్ విధానంలో పారదర్శకంగా సాగుతోందని వివరించారు.

# అమెరికాకు మోడీ విధేయుడైన సేవకుడు!

**- ట్రంప్ ఆదేశాలను యథాతథంగా పాటిస్తున్నారు**
**-భారతీయుల మరణానికి కారణమైన అమెరికా కనీసం క్షమాపణలు చెప్పలేదు**
**-సార్వభౌమాధికారం ఉన్న ఏ దేశమైనా ఇలాంటి భాషను సహిస్తుందా?**
**- మోడీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు**



**న్యూఢిల్లీ:**
ఒమన్ తీర ప్రాంతంలో అమెరికా జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందిన ఘటన దేశంలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ దాడులపై విచారం వ్యక్తం చేయకపోగా, భారత్‌ను ఉద్దేశించి అమెరికా హెచ్చరికలు జారీ చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధాని నరేంద్ర మోడీ ఒక విధేయుడైన సేవకుడిలా అమెరికా ఆదేశాలను పాటిస్తున్నారంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టు చేశారు. "ముగ్గురు భారతీయులు మరణానికి కారణమైన అమెరికా కనీసం క్షమాపణలు కూడా చెప్పలేదు. పైగా ఆదేశాలు జారీ చేస్తోంది. అమెరికా సైనిక ఆదేశాలను తక్షణమే పాటించాలని, ఎలాంటి ఉల్లంఘనను తాము సహించబోమని అమెరికా అంటోంది. సార్వభౌమాధికారం ఉన్న ఏ దేశమైనా ఇలాంటి భాషను సహిస్తుందా? కానీ ప్రధాని మోడీ మాత్రం విధేయుడైన సేవకుడిలా అమెరికా ఆదేశాలను పాటిస్తున్నారు. లోపభూయిష్టమైన ప్రధాని పాలనలో, భారతీయుడిగా ఉండటం అంటే దయనీయమైన దుస్థితిని ఎదుర్కోవడం. విదేశీ శక్తులు మన పౌరులను చంపుతున్నాయి. మన ప్రభుత్వం ఒక విధేయుడైన సేవకుడిలా తలవంచి ఆదేశాలను పాటిస్తుంది." అని – రాహుల్ గాంధీ, అన్నారు మరోవైపు, ఒమన్ తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ చమురు ట్యాంకర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన భారతీయ నావికుడు నిశాంత్ ఉగ్రనాథన్ మృతదేహాన్ని వెంటనే స్వదేశానికి తీసుకురావాలని రాహుల్ డిమాండ్ చేశారు. అతడి మృతదేహం కుళ్లిపోయేవరకి వచ్చిందని, మీ సెలేఫ్యల్ భారత కెప్టెన్ చెప్పినట్లు పేర్కొన్న ఒక పోస్టును రాహుల్ ట్యాగ్ చేశారు. ఒమన్‌లోని డ్రై పోర్టులో నిలిచి ఉన్న ఒక నౌకలో వైద్యపరమైన సమస్యల కారణంగా అతడు మరణించినట్లు మస్కట్‌లోని భారత రాయబార కార్యాలయం పేర్కొంది. అతని పార్థివ దేహం ప్రస్తుతం డ్రై పోర్టులోని నౌకలోనే ఉందని, త్వరగా భారతదేశానికి తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపింది. నౌకా యజమాన్య సంస్థతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, సంబంధిత భాగస్వాములతోందరితో సమన్వయం చేస్తున్నామని చెప్పింది.


# రేవంత్ రిజైన్ చేస్తేనే హైదరాబాద్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

ఫ్యూచర్ సిటీపై పడ్డారన్నారు. ఆదివారం నిర్వహించిన అంబర్‌పేట కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మూడు కార్పొరేషన్లలో బీజేపీ గెలుస్తుందని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పాలనలతో విసిగిపోయిన నగర ప్రజలు నిజమైన మార్పు, సుపరిపాలన కోసం బీజేపీనే ఏకైక ఆశగా చూస్తున్నారన్నారు

**మదర్ ఆఫ్ ఆల్ లైస్‌గా తెలంగాణ..**
మూడు కార్పొరేషన్ల పరిధిలో కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లాలి. కాంగ్రెస్ నాయకులు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. రెండున్నరేళ్లలోనే వ్యతిరేకత వచ్చింది. రాష్ట్రంలో ఏ వర్గం సంతోషంగా లేదు. ప్రజలకు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మదర్ ఆఫ్ ఆల్ లైస్‌గా తెలంగాణ మారింది. దేశంలోనూ అదే మాదిరిగా అబద్ధాలు ఆడుతున్నారు అని రాంచందర్‌రావు ఫైరయ్యారు.

# దేశం దశ, దిశను మార్చేది యువతే



**హైదరాబాద్**
దేశం దిశ, దశను మార్చేది యువతేనని ప్రముఖ పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. నగరంలోని జరిగిన సభలో వాంగ్‌చుక్ మాట్లాడుతూ సీజేపీ ఒక రాజకీయ వేదిక కాదనీ, ప్రతి భారతీయుడిని మేల్కొల్పడమే దాని ప్రాథమిక లక్ష్యమని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దే సంస్థల్లో వ్యవస్థాగత సమస్యలు సరిదిద్దడంతో పాటు పారదర్శకత, జవాబుదారీ తనం ఉండేలా చూడడంపై దేశం దృష్టి పెట్టాలన్నారు. ప్రధానమంత్రితో సహా ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉండాలని తెలిపారు. 17 లక్ష?ల మంది విద్యార్థుల జీవితాల తో చెలగాటమాడి, ఐదుగురి మరణానికి కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ, లేదంటే ఎన్డీఏ సర్కార్ ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ప్రజల గొంతులు అణచివేయకుండా, పౌరులు నిర్భయంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేసేలా దేశంలో పరిస్థితులు ఉండాలన్నారు. భయం, ద్వేషం లేని(ముక్త్ ) భారతే సీజేపీ లక్ష్యమని చెప్పారు. కేబీఆర్ పార్క్, మూసీ పరిరక్షణ కోసం తెలంగాణలో జరుగుతున్న పోరాటాలను ఆయన ప్రశంసించారు. 50 ఏండ్ల క్రితం సింగపూర్ దేశం ఇండియాతో పోల్చితే అత్యంత దిగువన ఉండేదని గుర్తు చేశారు.

# జోరుగా సాగుతున్న అమరావతి పనులు

(మొదటి పేజీ తరువాయి)

చూపిస్తూ ఆయన తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో ఒక వీడియోను పోస్ట్ చేశారు. "అమరావతిలో పనులు ఏమాత్రం ఆగడం లేదు. వర్షం కురిస్తే మునిగిపోయిందంటూ కొందరు ప్రచారం చేస్తున్నారు. కానీ, నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాజధానిలో ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ప్రధాన రహదారులు, రిజర్వాయర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం నిర్మిస్తున్న టవర్లు, మంత్రుల బంగళాల నిర్మాణాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఇకనైనా విష ప్రచారాన్ని ఆపండి" అని చెప్పిన ఓ వీడియోను మంత్రి లోకేష్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను వీడియో రూపంలో ప్రజల ముందు ఉంచి, అమరావతిపై జరుగుతున్న దుష్ప్రచారానికి మంత్రి లోకేష్ గట్టిగా బదులిచ్చారు.

# 'ఇండియా'పార్టీల్లో అంతర్మథనం

**కాంగ్రెస్ వెన్నుపోటు రాజకీయాలతో ఇప్పటికే దూరమైన డీఎంకే, ఆప్**
**రాహుల్ వైఖరితో పార్టీల్లో విసుగు**
**'హగ్' వ్యాఖ్యలపై లెఫ్ట్ గరం గరం**



న్యూఢిల్లీ
: కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఏర్పాటైన ప్రతిపక్ష ఇండియా కూటమి బీటలు వారుతున్నది. కాంగ్రెస్ వైఖరితో మిత్రపక్షాల్లో అంతర్మథనం మొదలైంది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరి బీజేపీకి లబ్ధి చేకూర్చేలా ఉన్నదని కూటమి పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ 'వెన్నుపోటు' రాజకీయాలతో ఇప్పటికే కూటమికి డీఎంకే, ఆప్ దూరమయ్యాయి. తాజాగా రాహుల్ చేసిన 'హగ్' వ్యాఖ్యలపై సీపీఎం ఫైర్ అయింది. కేరళలో రాజకీయ వైరుధ్యం కారుణంగా ఆ రాష్ట్ర మాజీ సీఎం విజయన్‌ను ఆలింగనం చేసుకోలేనన్న రాహుల్ వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాహుల్ వైఖరి కూటమి ఐక్యతను దెబ్బతీసేలా ఉన్నదని విజయన్ మండిపడ్డారు. 'ప్రధాని మోదీని రాహుల్ ఆలింగనం చేసుకున్న ఫొటోలు ఇంటర్నెట్ అంతటా ఉన్నాయి. ఆయన ఎవర్ని ఆలింగనం చేసుకుంటారన్న దానిపై నాకు వ్యక్తిగతంగా ఎలాంటి అభ్యంతరం లేదు. ఆ వ్యాఖ్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశమే ముఖ్యం. ఇండియా కూటమి పట్ల ఆయన వైఖరిని ఇవి ప్రతిబింబిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# భవిష్యత్తును రక్షించాలి



విద్య లేకపోవడంతో జ్ఞానం నశించింది, జ్ఞానం లేకపోవడంతో నైతిక విలువలు నశించాయి, నైతిక విలువలు లేకపోవడంతో అభివృద్ధి నశించింది, అభివృద్ధి లేకపోవడంతో సంపద నశించింది. ఒక్క విద్యాలోపం వల్లే ఇంత విఘాతం జరిగింది– అని దాదాపు 180 ఏళ్ల క్రితం జ్యోతిరావు పూలే అన్నారు. విద్య అనేది సమాజంలో మార్పు తీసుకొచ్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఆ ఆయుధాన్ని పదును పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ నేటి విద్యావిధానం శాస్త్రీయ దృక్పథంతో కాకుండా రాజకీయ, సాంస్కృతిక ఆధిపత్య సాధనంగా మారింది. పాఠ్యాంశాల్లో మార్పులు, చరిత్ర పుస్తకాల పునర్వ్యాఖ్యానాలు, సామాజిక శాస్త్రాల ప్రాధాన్యతను మసకబార్చడం వంటి చర్యలు ఊపందుకున్నాయి. అంతేకాదు, వరుసగా సిబిఎస్ఇ, నీట్ పరీక్షా పేపర్ల లీకేజీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని బట్టబయలు చేసింది.బి దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపు దిద్దుకుంటుందని చెబుతారు. కానీ నేడు భారత విద్యారంగం వైపు చూస్తే ఆశల కంటే ఆందోళనలే ఎక్కువగా కనిపిస్తాయి. పాఠశాలలు తిరిగి తెరుచుకుంటున్న ఈ సమయంలో విద్యార్థులు కొత్త పుస్తకాలతో, కొత్త కలలతో తరగతి గదుల్లో అడుగుపెడుతుంటే, విద్యావ్యవస్థ మాత్రం గందరగోళం, వివాదాలు, అనిశ్చితి, లీకేజీల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఉపాధ్యాయుల కొరత, పాఠ్యపుస్తకాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకపోవడం ఆందోళనకరం. సీబీఎస్ఈ తాజాగా తొమ్మిదో తరగతిలో త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలని, అందులో రెండు భారతీయ భాషలైనా ఉండాలని చెప్పడం ఆందోళన కలిగించే అంశం.

అంతేకాదు, దేశంలోని అతి పెద్ద జాతీయ పరీక్షా సంస్థలలో ఒకటైన సిబిఎస్ఇ, పదేపదే సంక్షోభాలలో చిక్కుకుంటోంది. జాతీయ ప్రవేశ పరీక్షలను నిర్వహించే సంస్థలు కూడా తరచుగా వివాదాలలో కూరుకుపోతున్నాయి. విద్యా వ్యవస్థలో మరో తీవ్రమైన సమస్య జవాబుదారీతనం లేకపోవడం. పాఠశాలలో చిన్న లోపం జరిగినా, ఉపాధ్యాయులపై చర్య తీసుకుంటారు. జిల్లా స్థాయి అధికారి పొరపాటు చేస్తే, విచారణ జరుగుతుంది. కానీ జాతీయ స్థాయిలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ ప్రభావితం చేసే లోపాలు జరిగితే దానికి బాధ్యులు ఎవరు? ఎవరిని జవాబుదారీ చేయాలి? 'సంస్థది తప్పు లేదు' అనే వైఖరి భారత అధికార యంత్రాంగంలోని పురాతన రోగాలలో ఒకటి. సిబిఎస్ఇ నుంచి నీట్ వరకు, రాష్ట్ర స్థాయి నియామక పరీక్షల నుంచి ఉద్యోగ నియామక ప్రక్రియల వరకు ప్రశ్నపత్రాల లీకేజీలు, అవకతవకలు, పారదర్శకత లేమి వరుసగా బయటపడుతున్నాయి. పరీక్ష అంటే ప్రతిభకు కొలమానం కావాలి. కానీ నేడది వ్యవస్థీకృత వైఫల్యాల బారిన పడుతోంది. "విద్య యొక్క అసలు లక్ష్యం వాస్తవాలను సేకరించడం కాదు; ఆలోచించే మనసును నిర్మించడం" అంటారో విద్యావేత్త. కానీ నేడు విద్యార్థుల ముందు నిలిచిన పరిస్థితి వేరు. ప్రశ్నాపత్రం లీక్ అవుతుందేమో, పరీక్ష వాయిదా పడుతుందేమో, ఫలితాల్లో తప్పులు వస్తాయేమో అన్న భయాలు వారిని వెంటాడుతున్నాయి. లక్షలాది యువత జీవితాలపై పడుతున్న మానసిక భారం. ఉద్యోగ నియామకాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పోటీ పరీక్షలకు ఏళ్ల తరబడి సిద్ధమయ్యే యువతకు నోటిఫికేషన్లలో ఆలస్యం, పరీక్షల రద్దు, లీకేజీలు, కోర్టు కేసులు నిత్యకృత్యంగా మారాయి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలిచ్చింది లేదు. ఫలితంగా యువతలో నిస్పృహ, నిరాశ, భవిష్యత్తుపై అనిశ్చితి పెరుగుతోంది. జాతీయ విద్యా విధానం గురించి గొప్ప ప్రసంగాలు చేయడం, డిజిటల్ విద్యపై సమావేశాలు నిర్వహించడం సులభం. కానీ ఒక విద్యా వ్యవస్థకు అసలైన కొలమానం, ఆ విద్యార్థికి ఫలితాలు సకాలంలో అందుతున్నాయా, పరీక్ష సురక్షితంగా నిర్వహించబడుతోందా, ఏదైనా ఫిర్యాదు వస్తే అది త్వరితగతిన పరిష్కరించబడుతోందా అనేదే. విద్యా రంగంలో సంస్కరణలు అవసరమే. కానీ సంస్కరణ అంటే కేవలం కొత్త నిబంధనలు తీసుకురావడం కాదు. విద్యార్థి, ఉపాధ్యాయుడు, తల్లిదండ్రుల అవసరాలను అర్థం చేసుకుని వ్యవస్థను మెరుగుపరచడం. పరీక్షల నిర్వహణలో సంపూర్ణ పారదర్శకత, సాంకేతిక భద్రత, బాధ్యతాయుత వ్యవస్థ, సామాజిక శాస్త్రాల బలోపేతం, ఉపాధ్యాయుల శిక్షణ– ఇవన్నీ కలిస్తేనే నిజమైన సంస్కరణ. సామాజిక శాస్త్రాలు సమాజాన్ని అర్థం చేసుకునే కిటికీలు. చరిత్ర మనకు గతాన్ని నేర్పుతుంది. రాజ్యాంగం ప్రజాస్వామ్య విలువలను తెలియజేస్తుంది. ఆర్థిక శాస్త్రం అభివృద్ధి దిశను చూపిస్తుంది. రాజకీయ శాస్త్రం హక్కులు, బాధ్యతలను వివరిస్తుంది. ఈ అంశాల ప్రాధాన్యత తగ్గితే విమర్శనాత్మక ఆలోచన బలహీనపడుతుంది. 'మనిషిలో ఇప్పటికే ఉన్న పరిపూర్ణతను వెలికితీయడమే విద్య– అంటారు స్వామి వివేకానంద. ఆ పరిపూర్ణతను వికసింపజేసే వ్యవస్థ, పాఠశాలల వాతావరణం అవసరం. విద్య కేవలం నేటి విద్యార్థుల సమస్య కాదు... రేపటి దేశ నిర్మాణం. అందుకే అంటాడు మహాకవి శ్రీశ్రీ– 'మీదే, మీదే సమస్త విశ్వం/మీరే లోకపు భాగ్యవిధాతలు/ మీ హాసంలో మెరుగులు తీరును/ వచ్చేనాళ్ల విభాప్రభాతములు– అని. దేశానికి నేడు కావలసింది విద్యపై రాజకీయ ఆధిపత్యం కాదు; విద్యపై సామాజిక బాధ్యత. పాఠ్యాంశాలపై నియంత్రణ కాదు; జ్ఞానంపై విశ్వాసం. 'ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో/ ఎక్కడ మనుషులు తలలెత్తి తిరుగుతారో/ఎక్కడ జ్ఞానం విరివిగా వెల్లివిరుస్తుందో/ ...ఆ స్వేచ్ఛ స్వర్గానికి, నా దేశాన్ని మేల్కొలుపు– అంటారు టాగూర్. విద్యాలయాల నుంచి సమాజంలోకి అడుగు పెట్టే యువతకు కావాల్సింది ఈ నూతన విద్యాసంవత్సరం అయినా సజావుగా సాగడం. ఆ బాధ్యతను ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం– అందరూ కలిసి నిర్వర్తించాల్సిన సమయం ఇదే.

# కృష్ణా నదిలో పడవ బోల్తా.

## నలుగురు మృతి

**హైదరాబాద్: జూన్ 14( మహా ప్రభ)**

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లాలోని కోనూరులో ఆదివారం తీవ్ర విషాదం నెలకొంది. కృష్ణా నదిలో ప్రయాణిస్తున్న ఒక నాటు పడవ అకస్మాత్తుగా బోల్తా పడి నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. మృతులను గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), కొనత చైతన్య (28)గా గుర్తించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .... ఒకే కుటుంబానికి చెందిన 10 మంది బంధువులు పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరు గ్రామ పరిధిలో జరిగే ఒక శుభకార్యానికి హాజరయ్యారు. వేడుక ముగిసిన అనంతరం వారంతా కలిసి కృష్ణా నది గుండా అవతలి



ఒడ్డుకు వెళ్లేందుకు ఒక చిన్న నాటు పడవపై తిరుగు ప్రయాణమయ్యారు. అయితే ప్రయాణం మధ్యలో నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో పడవ ఒక్కసారిగా అదుపుతప్పి నీటిలో బోల్తా పడింది. పడవ బోల్తా పడటంతో అందులో ఉన్న 10 మంది నీట మునిగిపోయారు. వారి కేకలు విన్న కోనూరు గ్రామస్థులు, మత్స్యకారులు వెంటనే నదిలోకి దూకి ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అయితే మిగిలిన నలుగురు నది ఉధృతికి కొట్టుకుపోయారు. నదిలో మునిగిపోయిన నలుగురిని గంధం సంధ్య (9), గంధం సైనీ (10), బత్తుల కార్తీక్ (12), చైతన్య (28)గా గుర్తించారు. స్థానికులు, ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కృష్ణా నది తీర ప్రాంత గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి లైఫ్ జాకెట్లు లేకుండా ప్రయాణికులను నాటు పడవలపై తరలించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, ఫిట్‌నెస్ లేని పడవలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘోర ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఢిల్లీ అగ్నిప్రమాదం కేసులో కీలక మలుపు..

## -అది ప్రమాదం కాదు.. కుట్ర..!

**న్యూఢిల్లీ: జూన్ 14( మహా ప్రభ)**

ఆగ్నేయ ఢిల్లీలోని గోవింద్‌పురి/తుగ్లకాబాద్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో జూన్ 12న జరిగిన ఘోర అగ్నిప్రమాదం కేసులో ఊహించని మలుపు వెలుగుచూసింది. మొదట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని భావించినప్పటికీ తాజాగా లభించిన సీసీటీవీ ఫుటేజీ పోలీసుల దర్యాప్తును పూర్తిగా మార్చేసింది. ప్రమాదం జరగడానికి కొన్ని క్షణాల ముందు ఒక గుర్తుతెలియని మహిళ భవనంలోకి వచ్చి వెళ్లిన దృశ్యాలు లభించడంతో ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన సజీవ దహన కుట్ర కావచ్చు అనే కోణంలో ఢిల్లీ పోలీసులు విచారణను తీవ్రతరం చేశారు.కాగా ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు




కోల్పోగా ఇద్దరికి తీవ్ర గాయాలపాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. జూన్ 12 తెల్లవారుజామున సుమారు 2:30 గంటల ప్రాంతంలో ఒక బహుళ అంతస్తుల నివాస భవనంలో భారీగా మంటలు చెలరేగాయి. అయితే భవనం వెలుపల ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా తెల్లవారుజామున సరిగ్గా 2:23 గంటల సమయంలో ముసుగు ధరించిన ఒక మహిళ లోపలికి వెళ్లడం కనిపించింది. ఆమె లోపలికి వెళ్లిన కొద్దిసేపటికే భవనంలో మంటలు అంటుకున్నట్టు పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెంటనే సదరు మహిళ వేగంగా భవనం నుంచి బయటకు వచ్చి నడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె కదలికలు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయని తేల్చిన పోలీసులు సదరు మహిళను ఇప్పటికే గుర్తించామని, ఆమెను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయని తెలిపారు. ఈ ఘోర ప్రమాదంలో భవనంలోని మూడో అంతస్తులో నివసిస్తున్న పంకజ్ (28), ఆయన తల్లి గుడ్డి దేవి (50), సోదరి సోని (20) మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. పంకజ్ చిన్న చెల్లెలు మోని (18), అమ్మమ్మ సుశీలా దేవి (70) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి మిగిలిన అంతస్తుల్లోని వారిని సురక్షితంగా రక్షించారు.

## కార్మికుని చట్టవిరుద్ధ తొలగింపుపై

# హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ: జూన్ 14( మహా ప్రభ)**

:కార్మికుల హక్కులను సమర్థిస్తూ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కీలకమైన తీర్పును వెలువరించింది. మహర్షి మార్కండేయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఒక ఉద్యోగిని చట్టవిరుద్ధంగా తొలగించడంపై ప్రధాన న్యాయమూర్తి జి. ఎస్. సింధవాలియా, జస్టిస్ బిపిన్ చందర్ నేగిలతో కూడిన డివిజన్ బెంచ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పారిశ్రామిక వివాదాల చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తూ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం చెల్లదని స్పష్టం చేసింది. అలాగే గతంలో లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. వివరాల ప్రకారం.. 2012 అక్టోబర్ నుండి మహర్షి మార్కండేయ వైద్య కళాశాలలో సదరు వ్యక్తి సెక్యూరిటీ కార్డుగా నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్నాడు. 2017 మార్చిలో తన తల్లి మరణించడంతో అతను సెలవుపై వెళ్లాడు. తిరిగి విధుల్లో చేరేందుకు వచ్చినపుడు, కళాశాల యాజమాన్యం అతడిని ఉద్యోగంలో చేర్చుకునేందుకు నిరాకరించింది. అతనిని విధుల్లోంచి తొలగించినట్లు యాజమాన్యం స్పష్టం



చేసింది. దీనిపై సదరు ఉద్యోగి లేబర్ కోర్టును ఆశ్రయించగా, కోర్టు సెక్యూరిటీ గార్డుకి అనుకూలంగా తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పును సవాలు చేస్తూ కళాశాల యాజమాన్యం హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ఆ ఉద్యోగిని కాంట్రాక్టర్ నియమించారని, తమ సంస్థకు చెందిన వాడు కాదని యాజమాన్యం వాదించింది. అతనే స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడని ఆరోపించింది. ఈ వాదనలకు తగిన ఆధారాలను యాజమాన్యం సమర్పించలేకపోయింది. ఆ ఉద్యోగి తొలగించడానికి ముందు గడిచిన 12 క్యాలెండర్ నెలల కాలంలో 240 రోజుల పాటు పనిచేసినందున పారిశ్రామిక వివాదాల చట్టంలోని సెక్షన్ 25ఎఫ్ నిబంధనలను పాటించడం అత్యవసరమని నిర్ధారించింది. అలాగే అతని స్థానంలో మరో ఉద్యోగిని నియమించినందున, ఆ చట్టంలోని సెక్షన్ 25హెచ్ నిబంధనలను కూడా పాటించడం తప్పనిసరి అని కోర్టు గుర్తుచేసింది. విచారణ సమయంలో కాంట్రాక్టర్ హాజరుకాకపోవడం, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగ స్థితికి సంబంధించిన ఆధారాలు లేకపోవడంతో, అతనికి అనుకూలంగా లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థించింది. రిజిస్ట్రార్ దాఖలు చేసిన అప్పీల్ ను కొట్టివేసింది. ఉద్యోగుల తొలగింపు విషయంలో కార్మిక చట్టాలను పాటించాల్సిన ఆవశ్యకతను ఈ తీర్పు స్పష్టం చేసింది. కార్మిక చట్టాలను ఖచ్చితంగా గౌరవించాల్సిందేనని ఈ తీర్పు ద్వారా న్యాయస్థానం గట్టి సందేశాన్ని ఇచ్చింది.

# మొబైల్ పేలిందని పుకారు..

## రైలులో నుంచి దూకి నలుగురు ప్రయాణికులు దుర్మరణం!

**న్యూఢిల్లీ: జూన్ 14( మహా ప్రభ)**

మధ్యప్రదేశ్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఖజురహో–ఉదయ్‌పూర్ రైలులో మొబైల్ పేలి మంటలు చెలరేగాయనే వదంతుల కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మంటల్లో కాలిపోతామేమో అన్న భయంతో చైన్ లాగి ట్రైన్‌లో నుంచి బయటకు దూకడంతో, పక్క ట్రాక్‌పై వెళ్తున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోని మురైనా జిల్లా, రాజస్థాన్‌లోని ధౌల్పూర్ మధ్య ఉన్న హేతంపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం ఖజురహో–ఉదయ్‌పూర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి మొబైల్ పేలిందని ప్రచారం జరిగింది. పేలుడు కారణంగా రైలుకు మంటలు అంటుకున్నాయని భావించిన పలువురు ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇంతలో ఓ ప్రయాణికుడు అలారం చైన్ లాగాడు. దీంతో రైలు మధ్యలోనే ఆగిపోయింది. అప్పటికే అగ్ని ప్రమాదం



జరిగిందన్న భయంలో ఉన్న పలువురు ప్రయాణికులు.. రైలు ఆగగానే ముందు వెనుక ఆలోచించకుండా బయటకు దూకేశారు. పక్క ట్రాక్‌పై పరుగులు పెట్టారు. అయితే అదే సమయంలో పక్క ట్రాక్‌పై ఆగ్రా వైపు నుంచి మురైనా వెళ్తున్న ఫిరోజ్‌పూర్–సీవని పాతాళ్‌కోట్ ఎక్స్‌ప్రెస్ వేగంగా పక్క ట్రాక్‌పై దూసుకొచ్చింది. ట్రాక్‌పై ఉన్న ప్రయాణికులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆఫ్రీన్(35), ఆమె నాలుగేళ్ల కుమారుడు అసద్ ఖాన్, ఆగ్రా జిల్లా రుసక్తాకు చెందిన శకుంతల (60), రాజస్థాన్‌లోని భిక్కనేర్ జిల్లాకు చెందిన వీర్మాదేవి(60) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, స్థానిక అధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై రైల్వే శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, మొబైల్ పేలుడు పుకారు ఎలా వ్యాపించింది, చైన్ లాగింది ఎవరు అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## కలుమూరి రాములు భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన :డాక్టర్ యేకుల రాజారావు



**దేవరకొండ జూన్ 14( మహాప్రభ )**
నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గశీ
పెద్దవూర మండలం ఏనేమిది గూడెం గ్రామంలో కలుమూరి రాములు మరణించిన విషయం తెలుసుకొని టి పి సి సి రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ జనరల్ సెక్రటరీ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ యేకుల రాజారావు ఆదివారం వారి స్వగృహంలో భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి అనంతరం మాట్లాడుతూ రాములు మరణించడం చాలా బాధాకరం అని విచారం వ్యక్తం చేస్తూ కుటుంబానికి బంధుమిత్రులకు తీరనిలోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు వారి కుటుంబ సభ్యులకు మన ధైర్యం కల్పించారు వారి వెంట దేవరకొండ మాజీ కౌన్సిలర్ గోపాల్ దాస్ చెన్నయ్య తదితరులు ఉన్నారు

## 12వ వార్డు కాలనీలో రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు.



**తూప్రాన్, జూన్ 14.(మహాప్రభ)**
తూప్రాన్ మున్సిపల్ లోని 12వ వార్డు మహంకాళి వెనుక స్ట్రీట్ లో డ్రైనేజీ వాటర్ లీకేజీ అయ్యి రోడ్డుపై పారుతుండడంతో గల్లిలోని వాసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 12వ వార్డు కొన్ని ఏరియాలో విద్యుత్,స్తంభాలకు స్ట్రీట్ లైట్స్ లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వర్షాకాలం సీజన్ కావడంతో ఎక్కడినుండి పాములు వస్తాయో అన్న భయాందోళనలో కాలనీ వాసులు బిక్కు బిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారు. 12వ వార్డు ప్రజా ప్రతినిధితో పాటు, మున్సిపల్ కమిషనర్ 12వ వార్డును పర్యటించి ఏర్పడిన సమస్యలను అవకతవకలను సరిచేయాలని 12వ వార్డు కాలనీవాసులు పేర్కొన్నారు.

## కన్కల్ లో బడిబాటపై అవగాహన..

**ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల మద్దతు**



**తాడ్వాయి జూన్ 14 (మహాప్రభ)**
కన్కల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధి, బడిబాట కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా సొంత ఊరిలోని ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసుకొని మెరుగైన విద్య అందించేలా సహకరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అవసరమైతే కేరళ రాష్ట్రం నుంచి ఉపాధ్యాయులను తీసుకువచ్చి మెరుగైన బోధన అందించే ప్రయత్నం చేస్తామని గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, మరియు గ్రామ పెద్దలు, తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ కోసం పాఠశాల వాతావరణాన్ని మరింత మెరుగుపరచడం, విద్యా ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపుతున్న తల్లిదండ్రులు కూడా సమావేశానికి హాజరై, తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రతిజ్ఞ నిర్వహించి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధితుడికి అందజేసిన కాంగ్రెస్ నాయకులు**



**గాంధారి, జూన్ 14 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం జువ్వాడిలో కాంగ్రెస్ నాయకులు బాధితుడు శ్రీకాంత్ రూ.13,000 సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి చెక్కు అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతవ్వ, కాంగ్రెస్ అధ్యక్షుడు భూమేశ్, మండల యూత్ ఉపాధ్యక్షుడు వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుల సమక్షంలో అక్బర్ తవక్కల్ మటన్ &చికెన్ షాప్ ఘన ప్రారంభం



**కూకట్పల్లి, జూన్ 14( మహా ప్రభ)**
కూకట్పల్లి నియోజకవర్గం, దాయరగూడ బస్తీ: స్థానిక ప్రజలకు నాణ్యమైన మటన్ మరియు చికెన్ ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో ఎమ్డీ అక్బర్ తవక్కల్ మటన్ ఒ చికెన్ షాప్ నేడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో అక్బర్‌తో పాటు ఆయన స్నేహితులు వెంకటేశ్వరరావు, చాంద్ బాషా, నాగరాజ్, సురేష్, హరిబాబు పాల్గొని షాప్‌ను ప్రారంభించారు.అక్బర్ గత కొన్ని సంవత్సరాలుగా మాంసం వ్యాపార రంగంలో అనుభవం కలిగి ఉండి, వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. అదే అనుభవంతో దాయరగూడ బస్తీలో నూతనంగా ఈ మటన్ ఒ చికెన్ షాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన మటన్ మరియు చికెన్ సరసమైన ధరలకు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమానికి హాజరైన స్నేహితులు వెంకటేశ్వరరావు, చాంద్ బాషా, నాగరాజ్, సురేష్, హరిబాబు అక్బర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.స్థానికులు, వ్యాపార వర్గాల ప్రతినిధులు పాల్గొని నూతన షాప్ ప్రారంభోత్సవాన్ని అభినందించారు.

# మా విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకాలుగా నిలుస్తున్న మా ఉపాధ్యాయులకు శుభాభినందనలు.

-ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచన.
-తరగతి గదుల్లోకి కొత్త ఉత్సాహంతో విద్యార్థినీ విద్యార్థులు అడుగు పెట్టాలి
-క్రమశిక్షణతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలి
-పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం మరియు పాఠశాల పరిసరాల పరిశుభ్రతను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలి.
-బడిబాట కార్యక్రమంలో భాగంగా, మొదటి రోజే విద్యార్థులకు కొత్త పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందించాలని స్పష్టం
- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులకు భరోసా
-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -14జూన్ -(మహాప్రభ ).**
పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో విద్యా ప్రణాళికకు రూపొందించుకొని పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు 928 , ప్రైవేట్ పాఠశాలలు 109. మొత్తం 1037 స్కూల్స్ పునఃప్రారంభమవుతున్నాయని అందులో ప్రభుత్వ 83,000 , ప్రైవేటు 43,000 మొత్తం 1,26,000 మంది విద్యార్థులు బడిబాట పట్టనున్నారని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ కొత్త పుస్తకాలు, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్వాగత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సాధించారన్నారు.. హాజరు శాతం పెంపు, డిజిటల్ బోధనకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని తెలిపారు.విద్యార్థి విద్యార్థులు నూతన ఉత్సాహంతో పాఠశాలలో అడుగు పెట్టాలన్నారు కార్పొరేట్ స్థాయికి దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన గుణాత్మక విద్య నందిస్తున్నామని తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పంపించే బాధ్యత తల్లితండ్రుల దేనని గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరాన్ని మనం ప్రారంభిస్తున్న ఈ తరుణంలో, మన పాఠశాల సామరస్యంతో, విజయంతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

## ఎలిగేడు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఏలేటి వెంకట్ రెడ్డి



**ఎలిగేడు, -14జూన్ -(మహాప్రభ ).**
ఎలిగేడు మండల సర్పంచుల ఫోరం ఎన్నికలు ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో ఏలేటి వెంకట్ రెడ్డిను ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కప్పల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల వెంకటేష్ గౌడ్, కోశాధికారిగా మద్దెల రమాదేవి సంపత్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు దుగ్గాల వాణి గోపాలరావు, కవ్వంపల్లి బాపయ్య, గోపు రజిత లక్ష్మారెడ్డి, రంగు లత శ్రీనివాస్, సిద్ధి తిరుపతి, మారం కొమురయ్య, దేవరనేని జమున వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.ఎన్నికల అనంతరం కొత్తగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు ఏలేటి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, సర్పంచుల సమస్యలు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఫోరం సమిష్టిగా కృషి చేస్తుందని తెలిపారు.

## పాలన మారినా సమస్య మారలేదు

**లింగారెడ్డి గూడలో డ్రైనేజీ సమస్య**



**ఫరూక్‌నగర్, -14జూన్ -(మహాప్రభ ).**
ఫరూక్‌నగర్ మండలంలోని లింగారెడ్డి గూడ గ్రామంలో డ్రైనేజీ సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.పాత నేషనల్ హైవే రహదారి పక్కన గల మస్జీదు, మదర్సా సమీపంలో షాద్‌నగర్ వైపు నుంచి వచ్చే అండర్‌గ్రౌండ్ మురుగు కాలువ నిలిచిపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మురికి నీరు నిల్వ ఉండి దోమలు పెరిగి, గ్రామ ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."పాలన మారినా సమస్య మారలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురికి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి" అని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

## కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశం



**గాంధారి, -14జూన్ -(మహాప్రభ ).**
కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పద్మశాలి సంఘ సభ్యులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివెళ్లారు. పద్మశాలి సంఘం తరఫున సర్వసభ సమావేశం ఏర్పాటు చేశారని పద్మశాలి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ..సంఘం బలోపేతం, సామాజిక ఐక్యత, కులస్థుల సంక్షేమం, భవిష్యత్ కార్యా చరణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు వారు తెలిపారు.24 మండలాలు మూడు పట్టణాలు జిల్లా కార్యవర్గం నూతన శాశ్వత సభ్యులు శాశ్వత సభ్యత్వానికి ప్రతి ఒక్కరికి ఐడి కార్డులు ఇచ్చామని తెలిపారు.ఈ సమావేశంలో రాజకీయ రంగంలో రాణించిన మున్సిపాలిటీ చైర్మన్ లకు, సర్పంచులకు, కౌన్సిలర్లకు, కోపరేషన్ మెంబర్స్ కు,వార్డ్ మెంబర్స్ కు,ఘనంగా సన్మానం చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గాంధారిమండల పద్మశాలి సంఘ సభ్యులు, సర్పంచులు,ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లు సంఘ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,కార్యదర్శులు, కోశాధికారులు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ



**ఆమనగల్లు, -14జూన్ -(మహాప్రభ ).**
ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్ తదితర ప్రాంతాలలో చిరు వ్యాపారమే జీవనాధారంగా కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులకు ఎండకు, వానకు రక్షణగా ఉంటుందని ఉద్దేశ్యంతో ఉచితంగా గొడుగులు అందజేయడం జరుగుతుందని ఉన్నతి ఒ శిక్ష ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆయా మండలాల చిరు వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా సహాయపడాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా స్వయం ఉపాధి, చిరు వ్యాపారులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ బండి రఘుపతి, సభ్యులు వంకురి శ్రీరామ్, వస్పుల రమేష్, మల్లేష్, ఇంజమూరి యాదగిరి, శివ, గణేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బాయిబాట కార్యక్రమం విజయవంతం చేయాలి

**- జిల్లా ఇన్‌చార్జ్ సలేంద్ర కొమరయ్య**



**పెద్దపల్లి, -14జూన్ -(మహాప్రభ ).**

తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న బాయిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ సలేంద్ర కొమరయ్య యాదవ్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, ఈ నెల 17న గోదావరిఖనిలో, 18న కరీంనగర్‌లో, 19న మంథని, పెద్దపల్లి, ధూళికట్ట ప్రాంతాల్లో కల్వకుంట్ల కవిత పర్యటించనున్నారని తెలిపారు. సింగరేణి కార్మికులతో నేరుగా సమావేశమై వారి సమస్యలను తెలుసుకుంటారని చెప్పారు.జిల్లాలో జెండా పండుగలను నిర్వహిస్తూ, పార్టీ పాంచజన్యంలో ప్రకటించిన పథకాలను ప్రజలకు వివరిస్తారని, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర పరిశీలకుడు పడాల మనోజ్ గౌడ్, హెచ్ఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎల్ వెంకట్, మంథని ఇన్‌చార్జ్ బొల్లం బుమేష్, నాయకులు బొంకురి సుభాష్, కల్వల తిరుపతి, సీహెచ్ హనుమాండ్లు, వంశీ, నాగరాజు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని బాయిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు.

## దళిత ఉద్యోగిపై దాడి చేసిన నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్



**పెద్దపల్లి, -14జూన్ -(మహాప్రభ ).**

జూలపల్లి మండలం తొగర్రాయి గ్రామ పంచాయతీ కార్యదర్శి, దళిత ఉద్యోగి అనంతుల అచ్చయ్యపై జరిగిన దాడిని ఆల్ ఇండియా దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు.బీజేపీ జూలపల్లి మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగి విధులు నిర్వహిస్తున్న సమయంలో దాడి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. బాధితుడికి పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపెల్లి బాపయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పాటకుల మహేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపెల్లి అశోక్, సీనియర్ నాయకులు బోపెల్లి మమేష్, దొడ్డెబాపు, ఎరవెల్లి సురేందర్‌రాజు, జిల్లెల ప్రశాంత్, పోతుల ప్రవీణ్, మోదుంపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.దళిత ఉద్యోగిపై దాడి చేసిన నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

## ఉమామహేశ్వర స్వామి దర్శించుకున్న కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**అమ్రాబాద్, -14జూన్ -(మహాప్రభ ).**

నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి అచ్చంపేట మండలం రంగాపూర్‌లోని శ్రీశైల ఉత్తర ద్వారం ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించారు.ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, గణపతి పూజ, ఉమాదేవి కుంకుమార్చన, స్వామివారి అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. స్వామివారి శేష వస్త్రంతో కలెక్టర్‌ను సన్మానించి వేద ఆశీర్వచనం పలికారు.కలెక్టర్ కుటుంబంతో కలిసి పాపనాశనం తీర్థాన్ని దర్శించి, ఆలయ పరిసర ప్రాంతాల ఆహ్లాదకర వాతావరణాన్ని కొనియాడారు. అనంతరం నిత్య అన్నదాన సత్రంలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, పోలీస్ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బీరం మాధవరెడ్డి, కమిటీ సభ్యులు పవన్ కుమార్, ముఖ్య అర్చకులు వీరయ్య శాస్త్రి, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.కలెక్టర్ దర్శనంతో ఆలయ పరిసర ప్రాంతంలో భక్తి వాతావరణం నెలకొంది.

# ఘనంగా పద్మశాలీల ప్రతిభా పురస్కారాల మహోత్సవం



**కరీంనగర్, -14జూన్ -(మహాప్రభ ).**

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని, విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, హ్యాండ్లూమ్ టెక్స్టైల్ చైర్మన్ దూడం వెంకటరమణ అన్నారు.కరీంనగర్ పద్మశాలి కళ్యాణమండపంలో పోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ఉద్యోగులకు పద్మ రత్న పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు సోషల్ మీడియా, సినిమాలకు దూరంగా ఉండి కష్టపడి చదువులో రాణించాలని వారు సూచించారు. చేనేతకు నిధులు తీసుకురావడంలో కార్పొరేషన్ కృషి చేస్తుందని తెలిపారు.పోపా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల కృషి వృథా కాకుండా ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతాయని అన్నారు. రాష్ట్రంలోనే కరీంనగర్ పోపా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఆర్డీవో కుందారపు మహేశ్వర్ దంపతులను ఘనంగా సత్కరించారు.జర్నలిస్టులకు పద్మ రత్న పురస్కారాలు మీడియా రంగంలో విశేష సేవలందిస్తున్న సీనియర్ జర్నలిస్టులు కొండ లక్ష్మణ్, మార్త ప్రకాష్‌లకు పద్మ రత్న పురస్కారాలను అందజేశారు. శాలువాతో సత్కరించి మెమొంటోలు ప్రదానం చేశారు.పద్మశాలీల ప్రతిభకు గుర్తింపుగా అందజేసిన ఈ పురస్కారాలు విద్యార్థులు, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## దేవాలయాల అభివృద్ధికి గ్రామస్థుల సంకల్పం

**హుస్నాబాద్, -14జూన్ -(మహాప్రభ ).**



అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో ఆదివారం గ్రామ పెద్దలు, యువకులు, వివిధ వర్గాల ప్రతినిధులు సమావేశమై బొడ్రాయి, దుర్గమ్మ, హనుమాన్ దేవాలయాల అభివృద్ధిపై చర్చించారు.దేవాలయాల నిర్వహణ, నిర్మాణ పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు కులాల ప్రాతిపదికన కమిటీ సభ్యులను నియమించారు. అనంతరం దుర్గమ్మ ఆలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. దేవాలయాల అభివృద్ధి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పనులను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. గ్రామ ప్రజలందరూ సహకరించి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.గ్రామస్థుల సమిష్టి సంకల్పంతో దేవాలయాల అభివృద్ధి గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పెద్దలు పేర్కొన్నారు.

# రావుల చెరువు పనులపై మంత్రి శ్రీధర్ బాబు ఆకస్మిక తనిఖీ



**మంథని, -14జూన్ -(మహాప్రభ ).**

: ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం ఉదయం మంథని రావుల చెరువు అభివృద్ధి పనులను ఆకస్మికంగా పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సత్వరమే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల డ్రైనేజీ పనులను వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్‌కు సూచించారు.ఈ తనిఖీలో కౌన్సిలర్ మారుపాక నీహారిక, జంబోజు ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, టిజీఆర్‌సి సలహాదారు శశిభూషణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.రావుల చెరువు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

## పిట్ ఇండియా ఓపెన్ జిమ్ ప్రారంభం



**కరీంనగర్, -14జూన్ -(మహాప్రభ ).**

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన ఫిట్ ఇండియా నినాదం స్ఫూర్తిగా కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ఓపెన్ జిమ్ అందుబాటులోకి వచ్చింది.నగరంలోని 12వ డివిజన్‌లో నాల్కో సీఎస్ఆర్ నిధులతో మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జిమ్‌ను మేయర్ కొలగాని శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ప్రజలు శారీరక శ్రమ అలవర్చుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మానేరు వాకర్స్ సంఘం సభ్యులు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.నగరంలో మరిన్ని ఆరోగ్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు.

## బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో...

# 16న రైతుల అవగాహన సదస్సు

**గాంధారి, జూన్ 14 (మహాప్రభ)**

బీజేపీ గాంధారి మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు 16న రైతు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గాంధారి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిత్ భారత్ 2047 విజన్లో భాగంగా బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో అన్నదాతలకు నూతన వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ వ్యవసాయం ప్రకృతి వ్యవసాయ ఆధునిక పద్ధతులను



వివరించనున్నట్లు తెలిపారు. దీనిలో జహీరాబాద్ పార్లమెంట్లోని ముఖ్యమైన నాయకులందరూ పాల్గొంటారని, ఈ సదస్సులో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా స్టేట్ సెక్రటరీ పొన్నాల వెంకటరెడ్డి, కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు కిషన్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీ రవీందర్రావు, మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, మాజీ అధ్యక్షులు సాయిబాబా, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## రామకృష్ణ సంతాప సభ.



**మందమర్రి -14జూన్ -(మహాప్రభ ).**

ఇటీవల మరణించిన బిఆర్ఎస్ నాయకులు రామకృష్ణ సంతాప సభను బస్టాండ్ ఏరియాలోని పద్మశాలి భవన్లో నాయకులు, మిత్రులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రమ్యకృష్ణ బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే వారిని పేర్కొన్నారు. అతనితో చేసిన పనులు జ్ఞాపకాలు నేటికీ మర్చిపోలేకపోతున్నామని ఎప్పుడు ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం ముందు ఉండేవాడే అని సూచించారు.ఆయన మరణం బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి.

**5 వ వార్డ్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము...**

**ఆమనగల్లు,- 14జూన్ -(మహాప్రభ ).**



అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రముఖ సంఘ సేవకుడు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం మీరిచ్చే రక్తం మరొకరి జీవితానికి అమృతం వంటిదని ఆయన అన్నారు. అన్నదానం ఆకలి తీరుస్తుంది,విద్యా దానం జీవితాన్ని ఇస్తుంది, రక్తదానం నిండు జీవితాన్ని నిలబెడుతుంది, రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి.మన వద్ద ఎంత సంపాదన ఉన్నా ఒకరి ప్రాణాన్ని కాపాడలేకపోవచ్చు కానీ మనం ఇచ్చే రక్తంతో జీవితాన్ని నిలబెట్టవచ్చు, రక్తదానం చేయండి మరికొందరికి స్ఫూర్తిగా నిలవండి,రక్తాన్ని దానం చేసి మనిషి విలువైన ప్రాణాల్ని నిలిపే రక్తదాతల స్ఫూర్తి ఎంతో గొప్పదని ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ పాపిశెట్టి రాము అన్నారు.

# బిజినెస్

## హైదరాబాద్, విజయవాడలో గోల్డ్ రేట్ తులం ఎంతుందంటే.

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. భారీగా పెరిగిన తర్వాత పసిడి, వెండి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు, డిమాండ్ తో గతంలో ఎన్నడూ లేని విధంగా పది గ్రాములు లక్షా 70 వేల వరకు పెరిగింది. ప్రస్తుతం లక్షా 49 వేల వరకు ఉంది. పెరిగిన అనంతరం ధరలు తగ్గుతూ వస్తున్నాయి. మూడు వారాల్లో తులం బంగారంపై దాదాపు 10 వేల వరకు ధర తగ్గింది. ముస్ముందు ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం గోల్డ్, సిల్వర్ రేట్లు స్థిరంగా కొనసాగాయి. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. ఆదివారం (జూన్ 14, 2026 ) ఉదయం ఆరు గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.

24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు రూ.1,49,080 గా ఉంది.

22 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములు రూ.1,36,650 గా ఉంది.



వెండి కిలోపై రూ.100 మేర తగ్గి రూ.2,60,000 లు గా ఉంది.

**అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.**

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,49,080, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,36,650 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,49,080, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,36,650 ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,49,230, 22 క్యారెట్ల ధర రూ.1,36,800 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,60,000 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,49,080, 22 క్యారెట్ల ధర రూ.1,36,800 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,60,000 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.151,200, 22 క్యారెట్ల ధర రూ.1,38,600 ఉంది. వెండి కిలో ధర రూ.2,70,000 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,080, 22 క్యారెట్ల ధర రూ.1,36,650 ఉంది. వెండి కిలో ధర రూ.2,60,000 లుగా ఉంది.

## ధరలు పెంచిన బీఎండబ్ల్యూ



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా.. తన బీఎండబ్ల్యూ, మినీ బ్రాండ్‌ల వాహనాల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ ధరల పెంపు జులై 1 నుంచి అమల్లోకి రానుంది. దేశీయంగా తయారయ్యే మోడళ్లతో పాటు, దిగుమతి అయ్యే వాహనాలకు కూడా ఈ ధరల పెంపు వర్తిస్తుంది. రూపాయి విలువ పడిపోవడం, రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులు పెరగడమే ఈ నిర్ణయానికి కారణాలని కంపెనీ తెలిపింది. ప్రీమియం నాణ్యతను కొనసాగించడానికే ఈ ధరల సవరణ అవసరమైందని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ పేర్కొన్నారు.

## రియల్‌మీ నార్జో డేస్ సేల్: 5జీ ఫోన్లపై భారీ తగ్గింపు!



తక్కువ ధరలో 5జీ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి రియల్‌మీ శుభవార్త అందించింది. నార్జో డేస్ సేల్‌లో భాగంగా నార్జో సిరీస్‌కు చెందిన పలు 5జీ మొబైళ్లపై భారీ తగ్గింపు ప్రకటించింది. ప్రముఖ ఈ-కామర్స్ వెబ్‌సైట్ అమెజాన్‌లో జూన్ 16వ తేదీ వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉండనుంది. Narzo 100 lite 5G, Narzo Power 5G, Narzo 90x 5G వంటి మోడళ్లపై గణనీయమైన డిస్కౌంట్లు లభిస్తున్నాయి. Narzo 100 lite 5G అసలు ధర రూ.27,999 కాగా, ఆఫర్‌లో రూ.15,249కే లభిస్తోంది.

## రష్యా చమురు దిగుమతుల్లో రెండో స్థానంలో భారత్

మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడినప్పటికీ, భారత ప్రభుత్వం ముందుచూపుతో ఈ సంక్షోభం నుంచి బయటపడింది. తాజాగా వెలువడిన గణాంకాల ప్రకారం, మే నెలలో రష్యా నుంచి ముడి చమురును కొనుగోలు చేసే దేశాలలో భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద దేశంగా అవతరించింది. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ నివేదిక ప్రకారం, మే నెలలో భారత్ రష్యా నుంచి సుమారు 5.8 బిలియన్ యూరోల (6.7 బిలియన్ డాలర్ల) విలువైన రష్యన్ చమురును దిగుమతి చేసుకుంది. ఇందులో 83 శాతం ముడి చమురు వాటా ఉంది.



# స్పోర్ట్స్

## ఫిఫా వరల్డ్ కప్.. 2-0తో టర్కీని చిత్తు చేసిన ఆస్ట్రేలియా!




ఫిఫా వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియా జట్టు శుభారంభం చేసింది. కెనడాలోని వాంకోవర్ వేదికగా జరిగిన గ్రూప్-డి ఓపెనింగ్ మ్యాచ్‌లో టర్కీపై 2-0 తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దాదాపు 24 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రపంచకప్ బరిలోకి దిగిన టర్కీ జట్టుకు ఆస్ట్రేలియా యువ ఆటగాళ్లు గట్టి షాక్ ఇచ్చారు. మ్యాచ్ ప్రారంభమైన 27వ నిమిషంలోనే ఆస్ట్రేలియా యువ ఫార్వర్డ్ ఆటగాడు నెస్టోరీ ఇరాన్‌కుందా అద్భుతమైన కౌంటర్ ఎటాకింగ్ గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ అద్భుత గోల్‌తో ప్రపంచకప్ చరిత్రలో ఆస్ట్రేలియా తరఫున గోల్ చేసిన అతి పిన్న వయస్కుడిగా ఇరాన్‌కుందా సరికొత్త రికార్డు సృష్టించాడు.ఆ తర్వాత టర్కీ ఆటగాళ్లు మ్యాచ్‌ను డ్రా చేయడానికి తీవ్రంగా శ్రమించినప్పటికీ ఆస్ట్రేలియా డిఫెన్స్ దాన్ని తిప్పికొట్టింది. ముఖ్యంగా 75వ నిమిషంలో మిడ్‌ఫీల్డర్ కానర్ మెట్‌కాఫ్ బాక్స్ వెలుపల నుండి ఒక అద్భుతమైన లో-షాట్‌తో రెండో గోల్ కొట్టి ఆస్ట్రేలియా విజయాన్ని పూర్తిగా ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 22 ఏళ్ల యువ గోల్‌కీపర్ పాట్రిక్ బీచ్ అసాధారణ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. టర్కీ జట్టు చేసిన పలు ప్రమాదకరమైన గోల్ ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకుని క్లీన్ షీట్ సాధించడంలో అతడు కీలక పాత్ర పోషించాడు. ఈ ఘన విజయంతో ఆస్ట్రేలియా జట్టు గ్రూప్-డి లో 3 పాయింట్లతో టోర్నీని ఉత్సాహంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ గ్రూప్‌లో పరాగ్వేపై 4-1తో గెలిచిన అమెరికా జట్టు అగ్రస్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతోంది.

## కామన్‌వెల్త్ స్క్వాడ్‌లో నీరజ్ చోప్రా..

### గురిందర్వీర్ సింగ్‌కూ చోటు..!

భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కామన్‌వెల్త్ క్రీడలకు ఎంపికయ్యాడు. దోహా డైమండ్ లీగ్‌కు దూరమైన నీరజ్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య ఈ మెగా ఈవెంట్‌కు తీసుకుంది. ప్రస్తుతం వెన్ను గాయం నుంచి కోలుకుంటున్న చోప్రాపై భారీ అంచనాలే ఉన్నాయి. జూలై 23 నుంచి మొదలయ్యే కామన్‌వెల్త్ క్రీడల కోసం ఆదివారం 32 మందితో కూడిన అథ్లెటిక్స్ బృందాన్ని ప్రకటించింది ఏఎఫ్ఐ.ప్రతిష్ఠాత్మక కామన్‌వెల్త్ క్రీడలే లక్ష్యంగా ఫిట్‌నెస్ మెరగుపరచుకుంటున్న నీరజ్ చోప్రాకు స్క్వాడ్‌లో దక్కింది. ప్రస్తుతం స్విట్జర్‌లాండ్‌లో ఉన్న ఈ జావెలిన్ త్రోయర్‌తో పాటు 32 మంది స్క్వాడ్‌లోకి ఎంపికయ్యారు. ఇటీవలే 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు బద్ధలు కొట్టిన గురిందర్వీర్ సింగ్, 200 మీటర్లతో రాణించిన అనిమేశ్ కుజుర్‌లు పతక వేటకు సిద్ధమవుతున్నారు.



కామన్‌వెల్త్ గేమ్స్ అథ్లెటిక్స్ స్క్వాడ్

గురిందర్వీర్ సింగ్ -- 100 మీటర్లు
అనిమేశ్ కుమార్ -- 200 మీటర్లు
గుల్వీర్ సింగ్ -- 5000 మీటర్లు 10000 మీటర్లు
తేజస్ అశోక్ షిర్సే -- 110 మీటర్ల హర్డిల్స్
యశస్ పి- 400 మీటర్ల హర్డిల్స్
సంతోష్ కుమార్ తమిలసరన్ -- 400 మీటర్ల హర్డిల్స్
సర్వేశ్ అనిల్ కుషార, ఆదర్శ్ రామ్ జే, పూజ -- హై జంప్
దేవ్ మీనా -- పోల్ వాల్ట్

శ్రీ శంకర్ ఎమ్, లోకేశ్ సత్యనాథన్ -- లాంగ్ జంప్
ప్రవీణ్ ఛిత్రవేల్, సెల్వా ప్రభు -- ట్రిపుల్ జంప్
సమర్దీప్ సింగ్, తేజిందర్‌పాల్, మన్‌ప్రీత్ కౌర్ -- షాట్ పుట్
నీరజ్ చోప్రా, రోహిత్ యాదవ్, యశ్ వీర్ సింగ్ -- జావెలిన్ త్రో

తేజస్విన్ శంకర్ -- డెకాథ్లాన్ హై జంప్
పరుల్ చౌదరీ -- 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్ 5000 మీటర్లు
సీమా పూనియా, నిధి రాణి -- డిస్కస్ త్రో
రవీనా, ప్రియాంక -- 10000 మీ రేస్ వాక్

## ధీరజ్, కుంకుమ్ పసిడి గురి..

### షాక్ తిన్న కొరియా ఆర్చర్లు..!




అంతర్జాతీయ వేదికపై భారత ఆర్చర్లు అదరగొట్టారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్‌కప్ ఆర్చరీలో ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహెద్ పసిడి గురితో దేశం గర్వించేలా చేశారు. ఆదివారం జరిగిన రికర్వ్ మిక్స్‌డ్ ఫైనల్లో దక్షిణ కొరియా జంటకు షాకిచ్చిన ధీరజ్, 17 ఏళ్ల కుంకుమ్ స్వర్ణ పతకంతో మెరిశారు. దాంతో, ఒలింపిక్ ఛాంపియన్ అయిన కొరియా ఆర్చర్లు వెండితో సరిపెట్టుకున్నారు.అంటల్యాలో జరిగిన వరల్డ్ కప్ ఆర్చరీలో భారత పతకం ఆశలు మోసిన ధీరజ్ బొమ్మదేవర, కుంకుమ్ మొహెద్ ఫైనల్లో చెలరేగిపోయారు. ఒలింపిక్ విజేతలైన కొరియా జంట కిమ్ జె డియోక్ -- ఓహ్ ఎ జిన్‌ను మట్టికరిపించారు. రికర్వ్ మిక్స్‌డ్ ఆర్చరీలో 5-1(37-36, 37-36, 39-39)తో ప్రత్యర్థిని నిలువరించి దేశానికి గోల్డ్ మెడల్ సాధించారు.రెండు నెలల వ్యవధిలో కొరియా జంటపై భారత ఆర్చర్లకు ఇది రెండో విజయం. ఆసియా క్రీడల్లో దీపికా కుమారి, కుంకుమ్ మొహెద్, అంకిత భకత్‌లతో కూడిన భారత త్రయం హోరాహోరీ పోరులో కొరియా ఆర్చర్లను చిత్తు చేసింది.



## రాకుమారిలా ముస్తాబైన శ్రీముఖి..

# డ్యాన్స్.. నా ఫిట్‌నెస్ మంత్రం



బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి జాన్వీ కపూర్. దక్షిణాది చిత్రసీమలో మరో అడుగు వేసింది. దేవరతో టాలీవుడ్ ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ.. 'పెద్ది'తో పెద్ద సక్సెస్ తన బుట్టలో వేసుకుంది. ఈ చిత్రంలో అందం, అభినయంతో సత్తా చాటింది. ఈ సందర్భంగా జగదేకవీరుడి కుమారుడితో జతకట్టిన ఈ అతిలోక సుందరి కుమార్తె పంచుకున్న కార్‌వాన్ కబుర్లివి.చాలామంది కాలక్షేపం కోసం డ్యాన్స్ నేర్చుకుంటారు. నేను ఇష్టంతో నేర్చుకున్నాను. నాకు డ్యాన్స్ అంటే ఒక ఎమోషన్. శాస్త్రీయ నృత్యం అంటే మహా ఇష్టం. కథక్ నేర్చుకున్నాను. ఇప్పటికీ నృత్య సాధన కొనసాగిస్తూనే ఉన్నా. ఇది నాకు శారీరక ఫిట్‌నెస్‌తో పాటు మానసిక ఆరోగ్యాన్ని అందించింది. ఎవరైనా బరువు తగ్గాలనుకుంటే రామ్‌చరణ్‌తో కలిసి డ్యాన్స్ చేస్తే చాలు.. సింపుల్‌గా వెయిట్‌లాస్ అవుతారు. మేము మూడు, నాలుగురోజులపాటు సాంగ్ షూటింగ్ చేసినప్పుడు చివరిరోజు డ్యాన్సర్లందరూ స్లిమ్‌గా అయినట్లు నాకు అనిపించింది. అంతలా డ్యాన్స్ చేసేస్తారు. తన వేగాన్ని అందుకోవడం అంత ఈజీ కాదు. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో డీప్‌ఫేక్, ఏఐ ఆధారిత ఫొటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇలాంటి ఘటన 15 ఏళ్ల వయస్సులో నాకే ఎదురైంది.ఇంటర్నెట్‌లో లోపించిన నైతికత ఆ క్షణంలో నాకు తెలిసొచ్చింది. ఆ పీడకల ఇప్పటికీ నన్ను వెంటాడుతూనే ఉంది. మా అమ్మ సినీ ఇండస్ట్రీలో ఒక తారలా మెరిసింది. కేవలం గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా అద్భుతమైన పాత్రల్లో అలరించింది. అందుకే ఆమెకు అభిమాని కానివారంటూ ఎవరూ ఉండరు. నేను కూడా ఆమె అభిమానినే. అమ్మకు తగిన వారసురాలు అనిపించుకునే ప్రయత్నం చేస్తాను. వ్యక్తిగత జీవితాన్ని చెప్పుకొంటే కూడా సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులు పెట్టి కొంతమంది పైశాచిక అనందాన్ని పొందుతున్నారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని నా జీవితంలో ఎదురైనా ఓ బాధాకరమైన విషయాన్ని బహిరంగంగా మాట్లాడాను. ఆ సమయంలో మానసికంగా చాలా కుంగిపోయి, కొంతకాలం మద్యం వైపు మళ్లిన విషయాన్ని కూడా నిజాయతీగా చెప్పాను. దానికి కూడా తప్పుడు ప్రచారం చేశారు. పాడ్‌కాస్ట్ నిర్వాహకులు స్పష్టత ఇచ్చేలోపు ఆ అబద్ధం ప్రపంచమంతా పాకిపోయింది. నాకు తెలుగు రాకపోవడం వల్ల చాలా ఇబ్బంది పడ్డాను. పెద్ది షూటింగ్ ప్రారంభంలో తెలుగు డైలాగులు చెప్పడానికి పెద్ద పెద్ద కసరత్తులే చేశాను. ఆ టైంలో రామ్‌చరణ్ నాకు ఎంతో సహకరించారు. డైలాగులు నేర్పిస్తూ నాలోని కంగారును పోగొట్టారు. ఆయన సెట్‌లో బుద్ధుడిలాగా ప్రశాంతంగా ఉంటారు. టాలీవుడ్‌లో ఇది రెండో సినిమా అయినా రామ్‌చరణ్ సహకారం వల్లే నా నటన మెరుగైంది.

# ఫౌజీ విడుదల అప్పుడేనా?



పానిండియా సూపర్‌స్టార్ ప్రభాస్ ప్రస్తుతం రెండు సినిమాల షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారు. వాటిల్లో ఒకటి హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఫౌజీ' కాగా, రెండోది సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్'. వీటిల్లో 'ఫౌజీ' ముందు విడుదల కానున్నది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. నిజానికి ఈ ఏడాది ఆగస్ట్ 14నే ఈ సినిమాను విడుదల చేయాలని ముందు మేకర్స్ భావించారు. కానీ సినిమాను పర్‌ఫెక్ట్‌గా తెరకెక్కించడానికీ, నాణ్యమైన వీఎఫ్‌ఎక్స్ కోసం కాస్త సమయం తీసుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఈ ఏడాది డిసెంబర్ 3న 'ఫౌజీ'ని విడుదల చేయాలనే ఆలోచనలో టీమ్ ఉన్నట్టు సమాచారం. రెండో ప్రపంచయుద్ధం కాలంనాటి పీరియడ్ డ్రామాగా దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో తిరుగుబాటుదారుడిగా మారిన ఓ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారు. ఈ పీరియాడిక్ డ్రామాలో అద్భుతమైన ప్రేమకథ కూడా మిళితమై ఉన్నదని వినికిడి. ఇమాన్వీ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో మిథన్‌చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద కీలక పాత్రధారులు. విశాల్‌చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ పానిండియా చిత్రాన్ని మైత్రీమూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

# నా దృష్టిలో వారే నిజమైన సూపర్‌స్టార్స్



సోషల్ మీడియాలో ట్రోలింగ్ కారణంగా గత కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ, మౌనంగా భరించిన బుట్టబొమ్మ పూజా హెగ్డే, తాజాగా నోరు విప్పింది. తనపై వస్తున్న నెగెటివిటీకి చెక్ పెడుతూ, ట్రోలర్స్‌కి సరైన సమాధానం ఇచ్చింది. 'నాకు ఇన్‌స్టాలో 30 మిలియన్ల కంటే ఎక్కువమంది ఫాలోవర్లున్నారు. అంతమాత్రాన నా సినిమా విడుదలైతే వారంతా టికెట్లు కొంటారని అనుకోవడం పొరపాటు.సోషల్ మీడియా ఫాలోయింగ్ అనేది జస్ట్ నంబర్ అంతే. అది సినిమా విజయంపై ఏ మాత్రం ప్రభావం చూపలేదు. ఇండస్ట్రీలో కొంతమందికి సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల ఫాలోవర్లే ఉంటారు. కానీ థియేటర్లలో వారికి ఉండే క్రేజ్ నెక్స్ట్ లెవల్. వారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద వందల కోట్ల కలెక్షన్లు రాబడతాయి. నా దృష్టిలో వారే నిజమైన సూపర్‌స్టార్స్. దీన్ని బట్టి నేను చెప్పేదేంటంటే.. నాలాంటి హీరోయిన్లకు ప్రేక్షకులే ముఖ్యం. ఏమాత్రం ఉపయోగం లేని ఇన్‌స్టా ఫాలోవర్స్ కాదు' అంటూ ఘాటుగా స్పందించింది పూజా హెగ్డే.

# సాలిడ్ సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల

అందాల భామ శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. చేసింది తక్కువ సినిమాలే అయిన విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అందాల భామ. తెలుగులో పెళ్లి సందణ సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తొలి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ సినిమాలో తన నటనతో ఆకట్టుకుంది శ్రీలీల ఈ మూవీ తర్వాత తెలుగులో శ్రీలీలకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. ధమాకా సినిమా తర్వాత అనేక ప్రాజెక్ట్స్ చేసినప్పటికీ ఆ స్థాయిలో హిట్టు మాత్రం రాలేదు. కానీ వరుసగా ఆఫర్స్ మాత్రం అందుకుంటుంది. అందం, అభినయంతోపాటు ఎనర్జీటిక్ డ్యాన్స్ తో ఆకట్టుకుంది. దీంతో తెలుగులో వరుస అవకాశాలు అందిపుచ్చుకుంది. ఓవైపు స్టార్ హీరోలకు జోడిగా నటిస్తూనే.. మరోవైపు కుర్రహీరోలస సరసన నటించింది.అయితే కొన్నాళ్లుగా ఈ బ్యూటీ నటించిన చిత్రాలు తెలుగులో ప్లాప్ అవుతున్నాయి. దీంతో ఇప్పుడు ఈ బ్యూటీ సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది. అయితే వరుసగా ప్లాపులు వస్తున్నప్పటికీ శ్రీలీల డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. ఇటీవలే పరాశక్తి సినిమాతో కోలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. శివకార్తికేయన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది.తెలుగులో ఈ అమ్మడు ఇప్పటివరకు పది సినిమాల్లో నటించింది. వాటిలో హిట్ అయినవి రెండే రెండు సినిమాలు అందులో ఒకటి ధమాకా అయితే మరొకటి భగవంత్ కేసరి సినిమా.. అయితే భగవంత్ కేసరి సినిమా బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో నటించింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా కూడా ఫ్లాప్ అయ్యింది. దాంతో ఈ అమ్మడికి తెలుగులో ఆఫర్స్ తగ్గాయి. ప్రస్తుతం శ్రీలీల అవకాశాల కోసం ఎదురుచూస్తుంది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంది. రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది శ్రీలీల. ఈ చిన్నదాని ఫోటోలకు ఫిదా అవుతున్నారు కుర్రకారు



Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com